


నీట మునిగిన పూడిమడక ఉప్పుగల్లీలు

చెరువును తలపిస్తున్న ఉప్పుగల్లీలు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పూడిమడక ఉప్పు రైతులను వర్షాలు మరోసారి ముంచాయి. రెండు రోజులుగా ఏకధాటిగా కురిసిన వర్షాలకు ఇక్కడి ఉప్పు గల్లీలు చెరువులా మారిపోయాయి. గట్లు కరిగిపోయి పొలాలన్నీ ఏకమయ్యాయి. దశాబ్దాలుగా ఈ పొలాలు భారీ వర్షాలకు నష్టపోతున్నా ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తయారుచేసిన ఉప్పును ఇక్కడే ఉంచామని, ప్లాస్టిక్ కవర్లతో కప్పినా ఉప్పు అది కరిగిపోయి నష్టపోయామంటున్నారు.

ఉపాధి మేళా నేడు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ గిరిబాబు తెలిపారు. మాండలీజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, కల్లెక్ట్ పామెలిన్, క్రెడిట్ యాక్సెస్ గ్రామీణ్ లిమిటెడ్, అపోలో టైర్స్, ఎస్.ఎస్.ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ పూర్తయి, 18 నుంచి 29 ఏళ్ల వయసున్న యువతీ, యువకులు హాజరుకావచ్చని సూచించారు.

ఇన్నాళ్లూ కళ్లకు గంతలు.. వ్యయం రెండింతలు

★ భారీగా పెరిగిన పోలవరం ఎడమ కాలువ పనుల విలువ
★ కూటమి సర్కారు చొరవ.. రూ.379 కోట్లతో 6(ఎ) ప్యాకేజీ



ఈనాడు, అనకాపల్లి, న్యూస్‌టుడే, ఎలమంచిలి

పోలవరం ప్రధాన ప్రాజెక్టునే నిర్లక్ష్యం చేసిన వైకాపా సర్కారు వాటి కాలువలను సైతం పట్టించుకున్న పాపాన పోలేదు. ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎడమ కాలువ పనులు అయిదేళ్ల నుంచి అసంపూర్తిగా నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పనులను పట్టాలెక్కించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.



పోలవరం కాలువ

ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలో ఉన్న 52.189 కిలోమీటర్ల పొడవున కాలువ పనులు చేపట్టారు. జగన్ కొలువుదీరిన తర్వాత అప్పటికే తవ్విన కాలువ మట్టిని ఆ పార్టీ నాయకులు అమ్మేసుకున్నారు. ఏళ్ల తరబడి పనుల్లో కదలిక లేకపోవడంతో అంచనా విలువలు భారీగా పెరిగిపోయాయి. దీంతో కూటమి సర్కారు అన్ని ప్యాకేజీలు ఒకేసారి కాకుండా దశలవారీగా వాటిని పూర్తిచేయాలని నిర్ణయించింది. కొత్త అంచనా విలువలతో అయిదు, ఆరు ప్యాకేజీల్లో మిగిలిపోయిన పనులను పట్టాలెక్కించడానికి చకచకా చర్యలు తీసుకుంటోంది. తద్వారా రైతులకు సాగునీరు, విశాఖ నగరానికి తాగునీరు ఇవ్వడానికి చొరవ చూపుతోంది.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెండు నెలల క్రితం ఎస్.రాయవరం మండలంలో పర్యటించారు. అసంపూర్తి పనులను పరిశీలించారు. వాటి పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

పాయకరావుపేట నుంచి ఎస్.రాయవరం మండలం దార్లపూడి వరకు 6, 6(ఎ) ప్యాకేజీ, దార్లపూడి నుంచి కశింకోట మండలంలోని తాళ్లపాలెం వరకు ఏడో ప్యాకేజీ పనులు చేయాలి. ఆరో ప్యాకేజీ దాదాపు పూర్తయ్యాయి. 6(ఎ) పనులు కేవలం 9.43 శాతం మాత్రమే జరిగాయి. ఇదివరకు రూ.152 కోట్ల అంచనా వ్యయంతో గుత్తేదారుకు పనులు అప్పగించారు. గత ప్రభుత్వంపై నమ్మకంలేక వారు పనులు చేయకుండా వదిలేశారు. ఆ ఒప్పందాన్ని రద్దు చేసి తాజాగా అంచనాలు సవరించి కొత్తగా టెండరు పిలిచారు. కొత్త రేట్ల ప్రకారం 6(ఎ) ప్యాకేజీ పనుల అంచనా విలువ ఇప్పుడు రూ.379 కోట్లకు పెరిగిపోయింది. కాలువ పొడవులో 111 కి.మీ నుంచి 136 కి.మీ వరకు ప్రధాన కాలువ తవ్వి ఇరువైపులా సిమెంటు లైనింగ్, ఇతర సీసీ పనులు చేయాలి. మధ్యలో కొన్నిచోట్ల వంతెనలు, అప్రోచ్ రోడ్లు నిర్మించాలి. ఈ పనుల విలువ రెండింతలు పెరిగింది.



కాలువ పైవంతెన పనులు ఇలా..

మిగతా ప్యాకేజీల్లోను అసంపూర్తే..

★ ఆరో ప్యాకేజీలో రూ.125.92 కోట్ల పనులకు గాను రూ.117.58 కోట్ల పనులు పూర్తయ్యాయి. ఇంకా ఏడు శాతం పనులు చేయాలి. వీటి అంచనాలు సవరిస్తే మరింత వ్యయం పెరగనుంది.

★ ప్యాకేజీ-7లో రూ.330 కోట్ల అంచనా విలువగల పనిలో రూ.278 కోట్ల పని పూర్తిచేశారు. మొత్తం పనిలో 84 శాతం జరిగినా ఇంకా 16 శాతం పనుల్లో కదలిక లేకుండా పోయింది.

★ ఎనిమిదో ప్యాకేజీలో రూ.113 కోట్ల పనికి గాను రూ.32 కోట్ల పని మాత్రమే జరిగింది. దీనికి సంబంధించి గుత్తేదారు సంస్థతో ఒప్పందాన్ని రద్దుచేసుకున్నారు. మిగిలిన పనులకు సంబంధించి కొత్త అంచనా విలువతో ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులకు ప్రోత్సాహం

సొంత ఖర్చుతో స్వర్ణ పతకాలు అందజేసిన అయ్యన్న



ఉపాధ్యాయులకు పతకాలు అందిస్తున్న అయ్యన్న

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీలు ఈనెల 20న నర్సీపట్నంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరగనున్నాయి. ఈ పోటీల్లో రాణించి విజేతలుగా నిలిచే 40 మంది క్రీడాకారులకు అందజేసేందుకు సభాపతి అయ్యన్నపాత్రుడు సొంత ఖర్చుతో స్వర్ణ పతకాలు సమకూర్చారు. వీటిని వ్యాయామ ఉపాధ్యాయులు దేవి, శ్రీనివాసనాయుడుకు గురువారం అందజేశారు. స్టేడియం వద్ద టెంట్లు, కుర్చీలకు అయ్యే ఖర్చు భరిస్తానని అయ్యన్న చెప్పారు. క్రీడాకారులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు ఈ పోటీలకు హాజరు కానున్నారు. ప్రతిభ చూపిన వారిని గుంటూరు జిల్లా తెనాలిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నారు.

పింఛన్ సొమ్ము స్వాహా

సంక్షేమ సహాయకుడిపై కలెక్టరేట్‌కు ఫిర్యాదు

గొలుగొండ, న్యూస్‌టుడే: సామాజిక పింఛన్లకు సంబంధించిన రూ.1.3 లక్షలు పాకలపాడు సచివాలయ సంక్షేమ సహాయకుడు అశోక్‌కుమార్ స్వాహా చేశాడని మండల పరిషత్తు అధికారులు ఆలస్యంగా గుర్తించారు. ఇక్కడ 26 మంది అనర్హులకు పింఛను అందుతోందని గత నెలలో తెదేపాకు చెందిన కొందరు మండల పరిషత్తు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అక్టోబరు నెలలో ఖజానా నుంచి పింఛను సొమ్ము విడుదలైంది. ఆ మొత్తాన్ని ఎవరికీ చెల్లించకుండా అశోక్‌కుమార్ సొంత అవసరాలకు వాడుకున్నట్లు తెలిసింది. ఆయన సచివాలయానికి రాకుండా ఫోన్ స్విచ్ఛాఫ్ చేయడంతో మండల పరిషత్తు అధికారులు గురువారం కలెక్టరేట్‌కు ఫిర్యాదు చేశారు.



చౌడువాడ పాల సంఘం ఎదుట రైతుల ఆందోళన

ఆవుపాల ధర తగ్గింపుపై రైతుల ఆగ్రహం


కె.కోటపాడు, మునగపాక, న్యూస్‌టుడే: ఆవుపాల ధర తగ్గిస్తూ విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనందకుమార్ తీసుకున్న నిర్ణయంపై పాడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాణా ధర పెంచి, పాల ధర తగ్గించడమేంటని సంఘాల అధ్యక్ష, కార్యదర్శులను నిలదీశారు. ఇలాగైతే డెయిరీకి పాలు సరఫరా చేసేదిలేదంటూ స్పష్టం చేశారు. కె.కోటపాడు మండలం చౌడువాడలో పాల సంఘం ఎదుట గురువారం ఆందోళన చేపట్టారు. ఉదయం 7.30 గంటల ఉంచి 9.30 వరకు పాల క్యాన్లతో కేంద్రం వద్దే ఉండిపోయారు. రైతుల ఆందోళనను యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్తామని సంఘ అధ్యక్షుడు కొమార వెంకటరమణ, డైరెక్టర్ సుందరపు గంగాధర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మునగపాగ తులసీ కల్యాణ మండపంలో అచ్యుతాపురం, మునగపాక మండలాలకు చెందిన సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు సమావేశమయ్యారు. పాడి రైతుల ఆగ్రహాన్ని డెయిరీ ఛైర్మన్ దృష్టికి తీసుకువెళ్లాలని నిర్ణయించారు.

రక్త పరీక్షలకూ ఇక్కట్లు

ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రిలో దుస్థితి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త పరీక్షలకు అవసరమైన రసాయనాలు అయిపోవడంతో రోగులు రక్త పరీక్షలు బయట చేయించుకోవాల్సి వస్తోంది. దీంతో ఆసుపత్రికి వచ్చే పేదలు ఇబ్బంది పడుతున్నారు. పరీక్షలు చేసే ఆధునిక పరికరాలు సైతం మరమ్మతులకు గురికావడంతో పలు రకాల రక్తపరీక్షలు నిలిచిపోయాయి.

ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రికి రోజుకి 400 మంది వరకు రోగులు వస్తుంటారు. వీరిలో 30 శాతం మందికి వైద్యులు రక్త పరీక్షలు రాస్తుంటారు. అయితే ఆసుపత్రిలో క్రియాటిన్, బైలిరూబిన్ తదితర పరీక్షలు చేసే రసాయనాలు అయిపోయాయి. లివర్, కిడ్నీలకు సంబంధించిన ఏ పరీక్షలు వారం రోజులుగా ఇక్కడ చేయడం లేదు. రసాయనాల కోసం జిల్లా డ్రగ్స్ స్టోర్‌కి లేఖ రాసినా ఇంత వరకు రాలేదు. రక్త పరీక్షల కోసం భారీ వ్యయంతో అత్యాధునిక పరికరాలు ఈ ఆసుపత్రికి సమకూర్చారు. ఇందులో ప్రధానమైనవి పనిచేయడం లేదు. టెక్నీషియన్‌కి సమాచారం ఇచ్చినా ఇంతవరకు మరమ్మతులు చేయడానికి రాలేదు. రక్త పరీక్షలు బయట ప్రైవేట్ ప్రయోగశాలల్లో చేయించుకోమని వైద్యులు చీటీలు రాసి ఇస్తున్నారు. ప్రైవేట్ ల్యాబ్ వాళ్లు పరీక్షలను బట్టి రూ.వెయ్యి నుంచి రూ.1500 వరకూ తీసుకుంటున్నారు. ఇది రోగులకు భారంగా మారింది. ఈ విషయాన్ని డ్యూటీ డాక్టర్ వద్ద ప్రస్తావించగా రసాయనాలు అయిపోవడం వాస్తవమేనని, ఆర్డర్ పెట్టారన్నారు.



ఆసుపత్రిలో రోగులు



పనిచేయని ఆధునిక పరికరాలు

108 కలశాలతో వాసవీ మాతకు పూజలు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, శతజయంతి ఉత్సవాల పౌర్ణమి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారి విగ్రహాన్ని పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. మూల విరాట్‌కి పంచామృతాలతో అభిషేకం చేశారు. రేజేటి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ మండపంలో అమ్మవారికి 108 కలశాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవదుర్గలకు పూజలు, చండీహోమం చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ఛైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో-ఛైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షులు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి జగదీశ్వరరావు పాల్గొన్నారు.



కలశాలకు పూజ చేస్తున్న భక్తులు

చినుకు చేసిన చిత్రాలు

ప్రకృతిలో ప్రతి అంశమూ అందంగానే ఉంటుంది. కొన్ని దృశ్యాలు అమితంగా ఆకట్టుకుంటాయి. నక్కపల్లిలో గురువారం ఉదయం కురిసిన వర్షానికి నీటి బిందువులు ముత్యాల్లా దర్శనమిచ్చాయి. కొన్నింటిపై భానుడి కిరణాలు పడగా, మొక్కల ఆకులపై కాంతులీనుతూ మెరిసిపోయాయి.

– నక్కపల్లి, న్యూస్‌టుడే





మునగపాకలో..

★ ప్రస్తుతం కురిసిన వర్షాలు పంటలకు మేలు చేశాయని, పొట్ట దశలోని వరి పంట త్వరగా పక్వదశకు వస్తుందని పరిశోధన కేంద్రం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్.ముకుందరావు తెలిపారు. వర్షాలతో నీట మునిగిన ప్రాంతాలు ఏమీ లేవన్నారు. ఎక్కడైనా లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరితో తొలగించాలన్నారు. మెట్ట ప్రాంతాల్లో చెరకు తోటలకు వానల వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని వివరించారు. రబీ సాగుకు భూములు సిద్ధం చేసుకోవచ్చని పేర్కొన్నారు.


వర్షాలతో వరికి మేలు

అనకాపల్లి, న్యూస్‌టుడే: వాయుగుండం బలహీన పడుతోందన్న వార్తతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాలో మూడు రోజులుగా పలు ప్రాంతాల్లో వర్షాలు పడ్డాయి. జిల్లాలో అన్ని పంటల కంటే వరి అధికం. ప్రస్తుతం పంట పొట్టదశలో ఉంది. ఈ సమయంలో వర్షాలకు పంట నీట మునిగితే నష్టం భారీగా ఉంటుందని రైతులు ఆందోళన చెందారు. అయితే ఆ పరిస్థితులు ఎక్కడా చోటు చేసుకోలేదని వ్యవసాయాధికారులు తెలిపారు. జిల్లాలో గురువారం మూడు మండలాల్లో అధిక వర్షపాతం నమోదైంది. రాంబిల్లిలో 45.2 మి.మీ., అచ్యుతాపురంలో 44.2 మి.మీ., పరవాడలో 32.2 మి.మీ. పడినట్లు వ్యవసాయ పరిశోధన కేంద్రం వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు తెలిపారు. నక్కపల్లి, ఎస్.రాయవరం, మునగపాక, పాయకరావుపేటలో 20 మి.మీ. కంటే ఎక్కువ వర్షం కురిసింది. మిగిలిన ప్రాంతాలో చిరుజల్లులే పడ్డాయి.



పెందుర్తిలో..

కాయలకు సంచులతో రక్ష



కాయలకు కవర్లు కడుతున్న రైతు

విత్తు మొదలు పంట చేతికొచ్చే వరకు సాగులో ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలి. విత్తనం వేశాక మొలకెత్తే వరకు, మొలక వచ్చాక మొక్కగా ఎదిగే వరకు, ఆపై ఫలసాయం చేతికందే వరకు రైతులు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపడుతుంటారు. ఈ క్రమంలోనే కె.కోటపాడు మండలం ఆర్లి గ్రామానికి చెందిన ఓ రైతు తోటలో కాపుకొచ్చిన జామ కాయలను రామచిలుకలు కొట్టకుండా రక్షణగా తెల్లని సంచులు కడుతున్నారు. ఇలా చేస్తే కాయ రాలిపోవడం పెద్దగా ఉండదని ఆ రైతు చెప్పారు.

– ఈనాడు, కె.కోటపాడు

రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక

రావికమతం, న్యూస్‌టుడే: టి.అర్జాపురం జడ్పీ పాఠశాల విద్యార్థులు బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 బాలికల విభాగంలో ఆర్.శృతి, గిరిజ, భారతి, లక్ష్మీకుమారి, బాలుర విభాగంలో ఎస్.మహంత్, ఆర్.ప్రవీణ్‌కుమార్, జి.లోకేశ్, అండర్-17 బాలికల విభాగంలో ఎం.రుషిత, బాలుర విభాగంలో ఆర్.ప్రసాద్ ఎంపికయ్యారని పీఈటీ రమేష్‌నాయుడు చెప్పారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చోడవరం మండలం గోవాడ జడ్పీ పాఠశాలలో జరిగిన పోటీల్లో సత్తా చాటారన్నారు. అన్నమయ్య జిల్లా అంగులూరులో నవంబరు 6, 7 తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను హెచ్‌ఎం నాయుడు, సర్పంచి ఫాల్గుణ, వైస్ ఎంపీపీ భవానీప్రసాద్, సీఆర్‌పీ రామారావు, స్కూలు కమిటీ ఛైర్మన్ పెంటారావు గురువారం అభినందించారు.



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం నాయుడు, పీఈటీ రమేష్

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని గుంటపల్లి గ్రామంలో విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందారు. ఏఎస్సై గోవిందరావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తోట పద్మనాగేశ్వరరావు (58) ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. నిర్మాణ పనుల్లో భాగంగా ఇనుప ఊచలు స్లాబ్‌పైకి తీసుకువెళుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్తు తీగలకు తాకడంతో కుప్పకూలిపోయారు. గమనించిన బంధువులు నాగేశ్వరరావును చికిత్స నిమిత్తం తుని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు జరిగిన ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.



మృతి చెందిన పద్మనాగేశ్వరరావు

వరద బాధితులకు రూ. 2.5 లక్షల విరాళం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులకు సహాయం అందించేందుకు పరవాడలోని సైరెక్స్ ఫార్మా కంపెనీ యాజమాన్యం విరాళం అందించింది. రూ. 2.5 లక్షల చెక్కును కంపెనీ ఎండీ ఎం.వెంకటేశ్వరరావు తరఫున వైస్ ప్రెసిడెంట్ ఎం.వెంకటరెడ్డి గురువారం కలెక్టర్ విజయకు అందజేశారు. విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజినీర్ పి.ముకుందరావు పాల్గొన్నారు.



కలెక్టర్‌కి చెక్ అందిస్తున్న సైరెక్స్ ఫార్మా కంపెనీ ప్రతినిధి

అభిజిత్ పరిశ్రమను తెరిపించాలి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అభిజిత్ ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీ మూసివేయడం వల్ల వేలాది మంది కార్మికులు, నిర్వాసితులు ఉపాధి లేక రోడ్డున పడ్డారని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము ఆందోళన వ్యక్తం చేశారు. మూసివేసిన కంపెనీని తిరిగి తెరిపించాలని, నిర్వాసితులకు ఉపాధి కల్పించాలనే డిమాండ్‌తో కంపెనీ నుంచి పాదయాత్రగా బయలుదేరిన అభిజిత్ కార్మికులు, సీఐటీయూ నాయకులు తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు. అభిజిత్ లేఅవుట్ చట్ట వ్యతిరేకమని నాయకులు రాము, సోమునాయుడు మండిపడ్డారు. అభిజిత్‌కు భూములు ఇచ్చిన వెయ్యిమంది సెజ్ నిర్వాసితులు కూడా రోడ్డునపడ్డారన్నారు. కార్మికులు, నిర్వాసితుల ఉపాధిని దృష్టిలో ఉంచుకుని కంపెనీని తెరిపించడానికి జిల్లా యంత్రాంగం, రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. కంపెనీని తెరిచేవరకు కార్మికులకు అండగా ఉంటామని ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. వర్షంలోనూ కార్మికులు ఆందోళన చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ శ్రామ్యుక్‌కు వినతిపత్రం అందించారు.



తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన కార్మికులు, నాయకులు

నాస్కామ్ సహకారం.. అంకురాలకు శ్రీకారం



ఈనాడు, విశాఖపట్నం

అనేక క్లిష్ట సమస్యలకు పరిష్కారం.. | ప్రభుత్వం సహకరిస్తే మరిన్ని ప్రాజెక్టులు



1 ఆంధ్ర విశ్వవిద్యాలయ ప్రాంగణంలో నెలకొల్పిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) అంకురాలను ప్రోత్సహిస్తోంది. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం, నాస్కామ్ సంయుక్తంగా దీన్ని ఏర్పాటుచేశాయి. సీవోఈ సహకారంతో నెలకొల్పిన అంకుర సంస్థలు అనేక క్లిష్ట సమస్యలకు పరిష్కారాలు చూపుతున్నాయి. ఆ ప్రాజెక్టులను వైద్యారోగ్య, విద్య, తదితర శాఖల్లో ప్రయోగాత్మకంగా చేపట్టారు. ప్రభుత్వ సహకారం అందిస్తే పూర్తిస్థాయిలో అమలుచేసేందుకు వీలుంటుందని అంకుర సంస్థల ప్రతినిధులు చెబుతున్నారు.

మందులు సమయానికి తీసుకునేలా..

2 గ్రామీణులు, దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారు క్రమం తప్పకుండా ఔషధాలు వాడాలి. రోగులు సమయానికి మందులు వాడుతున్నారా.. లేదా.. పర్యవేక్షించేందుకు ఓ అంకుర సంస్థ 'పిల్‌బాక్స్ రిమైండర్' అనే ప్రాజెక్టును రూపొందించింది. ఒక డబ్బాలో మాత్రలన్నీ పెడితే.. సాంకేతిక సహాయంతో మందులు వేసుకోవాల్సిన సమయానికి అలర్ట్ వస్తుంది. అప్పుడు డబ్బా తెరిచి, మందులు వేసుకున్నారా? లేదా? అనే వివరాలు కూడా తెలుసుకోవచ్చు. దీన్ని విశాఖ జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలుచేశారు. దీన్లో అవసరమైన మార్పులు సూచిస్తే, పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని అంకుర సంస్థ యజమాని ఎం.శ్రీనివాస్ చెబుతున్నారు.



అంకుర సంస్థ రూపొందించిన 'ఔషధాల డబ్బా'

గర్భిణులను పరీక్షించేందుకు..

గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణులు ఆరోగ్య కేంద్రాలకు వచ్చేందుకు సంకోచిస్తుంటారు. దీంతో ఆశా కార్యకర్తలు అన్ని యంత్రాలు మోసుకెళ్లి బీపీ, తదితరాలు పరీక్షిస్తున్నారు. 'నేచ్ మామ్' అనే అంకుర సంస్థ చేతిలో ఇమిడే పరికరాన్ని తీర్చిదిద్దింది. దీంతో సులభంగా గర్భిణుల బీపీ, గుండె స్పందన, ఆక్సిజన్‌స్థాయిలు, ఉష్ణోగ్రత తెలుసుకోవచ్చు. దీని ద్వారా 3 నెలపాటు 3000 మంది గర్భిణులను పరీక్షించారు. ఆ వివరాలను ఆసుపత్రుల్లోని యంత్రాల్లో పరీక్షించిన విలువలతో సరిపోల్చగా 98 శాతం కచ్చితత్వం కనిపించింది. ఆరోగ్యశాఖ ఆ సాంకేతికత బాగుందని ప్రశంసాపత్రం ఇవ్వగా.. ఆ సంస్థ తమిళనాడులో భారీ ప్రాజెక్టు కైవసం చేసుకుంది.



పీహెచ్‌సీలో మైక్రోస్కోప్‌లో నమూనాలు పరీక్షిస్తున్న టెక్నీషియన్

3 టెలీ పాథాలజీ సేవలు..

గ్రామీణ, ఇతర కీలక పరీక్షలు చేసేందుకు పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో సరైన సదుపాయాలు లేవు. పాథాలజిస్టులు లేకపోవడంతో రోగులు జిల్లా కేంద్రాసుపత్రులకు అనకాపల్లి లేదా విశాఖ వెళ్లాల్సి ఉంటుంది. దీంతో చాలా మంది రోగులు ఆ పరీక్షలు చేయించుకోవట్లేదు. దీనికి పరిష్కారంగా ఓ అంకుర సంస్థ 'టెలీ పాథాలజీ' అనే సదుపాయాన్ని అభివృద్ధి చేసింది. వైద్యారోగ్యశాఖతో కలిసి అనకాపల్లి జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల్లో దీన్ని ప్రారంభించారు. ఆసుపత్రుల్లో పరికరాలు సమకూర్చి, టెక్నీషియన్లకు శిక్షణ ఇచ్చారు. దీంతో రోగులకు పరీక్షలు చేసి, ఆ వివరాలను ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేస్తారు.

● జిల్లా కేంద్రాసుపత్రిలోని పాథాలజిస్ట్ సాఫ్ట్‌వేర్‌లో చూసి, నివేదికలు ఇస్తారు. తర్వాత దీన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలుచేయాలని భావించినా ముందుకు సాగలేదు. ఆ సంస్థ ఈ ప్రాజెక్టును నాస్కామ్ సహకారంతో చండీగఢ్‌లో నిర్వహిస్తున్నారు.

దాడులపై వైద్యుల ఆందోళన

రోలుగుంట, న్యూస్‌టుడే: అర్ధరాత్రి సమయంలో కొందరు మద్యం మత్తులో ఆసుపత్రులకు వచ్చి సిబ్బందిపై దాడులకు పాల్పడుతున్నారని బుచ్చెంపేట, రోలుగుంట పీహెచ్‌సీ వైద్యులు సునీత, స్రవంతి ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీపీ శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటైంది. కొంతకాలంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను వైద్యాధికారులు సమావేశంలో ఏకరువు పెట్టారు. స్థానిక నాయకులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా దాడులకు అడ్డుకట్ట పడటం లేదన్నారు. సిబ్బందికి రక్షణ లేకుంటే రాత్రి సమయాల్లో విధులు నిర్వహించలేమని స్పష్టంచేశారు. ప్రజాప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటుచేసి ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీపీ హామీ ఇచ్చారు. ఉపాధి హామీ పథకం ఏపీవో ఈశ్వరరావు మాట్లాడుతూ.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ. 34.26 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కుసర్లపూడిలో జగనన్న కాలనీకి రహదారి, విద్యుత్తు, తాగునీటి వసతి కల్పించాలని సర్పంచి అప్పలనాయుడు కోరారు. జడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీరమణమ్మ, సర్పంచులు శ్రీనివాసరావు, కృష్ణంనాయుడు, ఎంపీడీవో నాగేశ్వరరావు, పీఆర్ ఏఈ ఉమామహేశ్వరుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్‌బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమ్య, ఎంఈవో జగ్గారావు, వైస్ ఎంపీపీ సన్యాశినాయుడు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఆవేదన వ్యక్తం చేస్తున్న వైద్యులు

కల్వర్టు లేక రాకపోకలకు ఇబ్బందులు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని రామారాయుడుపాలెం వద్ద గెడ్డపై కల్వర్టు నిర్మించాలని కోరుతూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. గెడ్డపై కల్వర్టు కొట్టుకుపోయి చాలా కాలం అవుతున్నా ఇంతవరకూ మున్సిపల్ అధికారులు పునర్నిర్మించలేదన్నారు. ప్రజలు రాకపోకలకు చాలా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సీఐటీయూ మండల కార్యదర్శి చింతకాయల శివాజీ మాట్లాడుతూ పన్నులు వసూలు చేస్తున్న అధికారులు ప్రజల కష్టాలు పట్టించుకోవడం లేదని చెప్పారు.



సీఐటీయూ నాయకులు, గ్రామస్థుల ధర్నా

సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా...



అచ్యుతాపురం, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) శ్రీనివాస్ మృతిచెందారు. ఆయన గతంలో వార్ల మండలంలో విధులు నిర్వహించారు. అచ్యుతాపురం ఎంపీడీవోగా 2014 నవంబరు నుంచి 2016 జూన్ వరకు శ్రీనివాస్ అందుబాటులో ఉండి సేవలు అందించారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛ భారత్, వనం-మనం వంటి కార్యక్రమాల్లో వైకల్యాన్ని సైతం లెక్కచేయకుండా చురుగ్గా పాల్గొన్నారు. వీలుచిక్కిన సమయాల్లో విద్యార్థులకు ఉచితంగా ప్రేరణ తరగతులు నిర్వహించేవారు. ఈయన గురువారం రాజమహేంద్రవరంలో గుండెపోటుతో మృతిచెందారని తెలిసి పలువురు కంటతడిపెట్టారు. భౌతికంగా దూరమైనా సేవల్లో జీవించే ఉంటారని మాజీ ఎంపీడీవో శ్రీనివాసరావు, రాజాన రమేష్‌కుమార్ తెలిపారు. ఆయన పెందుర్తి ఎంపీడీఓగా, జడ్పీ డిప్యూటీ సీఈఓగా, సెట్విస్ సీఈఓగా, విశాఖ సమగ్రశిక్షా అభియాన్ పీఓగా జిల్లాలో వివిధ హోదాల్లో పనిచేశారు. శ్రీనివాసరావు అంత్యక్రియలు కూర్మన్నపాలెంలో శుక్రవారం నిర్వహిస్తారని కుటుంబ సభ్యులు తెలిపారు.



'ఈనాడు' ఆధ్వర్యంలో జరిగిన శ్రమదానంలో పాల్గొన్న ఎంపీడీవో శ్రీనివాస్ (పాత చిత్రం)



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న లోకేశ్, తెదేపా నేతలు

లోకేశ్‌కు ఘన స్వాగతం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ కోర్టులో పని నిమిత్తం మంత్రి నారా లోకేశ్ గురువారం రాత్రి విశాఖ విమానాశ్రయం చేరుకున్నారు. ఆయనకు తెదేపా రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యేలు గణబాబు, వెలగపూడి, ఎమ్మెల్సీ చిరంజీవిరావు స్వాగతం పలికారు.

అర్ధరాత్రి గ్రావెల్ అక్రమ తవ్వకాలు

అడ్డుకున్న తమరానపాలెం రైతులు

రోలుగుంట, న్యూస్‌టుడే: అధికారం లేకున్నా వైకాపా నాయకుల్లో కొందరు గ్రావెల్ అక్రమ తవ్వకాలను యథేచ్ఛగా సాగిస్తున్నారు. అధికారులు, పోలీసుల కళ్లుగప్పి అర్ధరాత్రి సమయంలో టిప్పర్లలో తరలిస్తున్నారు. రోలుగుంట - మాకవరపాలెం మండలాలకు సరిహద్దునున్న శీతనపాలెం సమీపంలోని కొండపై అదే ప్రాంతానికి చెందిన వైకాపా నాయకుడి కన్నుపడింది. కొద్దినెలలుగా రోజూ రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము 4 గంటల వరకు పొక్లెయిన్‌తో తవ్వకాలు చేస్తూ టిప్పర్లతో తరలిస్తున్నారు. తవ్వకాలు జరిగే ప్రాంతానికి సమీపంలోని సాగు భూములు దెబ్బతింటుండటంతో బాధిత రైతులు వారం రోజుల కిందట తహసీల్దార్, పోలీసుస్టేషన్, గనులశాఖ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. ఫలితం లేకపోవడంతో బుధవారం అర్ధరాత్రి పొక్లెయిన్లు, టిప్పర్లను అడ్డుకున్నారు. ఫొటోలు తీసి పోలీసులకు అందజేశారు.



కుసర్లపూడి గ్రావెల్ తవ్వకాలు జరిగే ప్రాంతం

కాస్మెటిక్స్ విక్రయాల ముసుగులో ఆన్‌లైన్ మోసాలు



స్వాధీనం చేసుకున్న సిమ్‌లు



ల్యాప్‌టాప్‌లు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ నగరంలో కాస్మెటిక్స్ అమ్మకాల ముసుగులో ఆన్‌లైన్ బెట్టింగ్, ఇతర ఆన్‌లైన్ మోసాలకు పాల్పడుతున్న కేంద్రంపై విశాఖ సైబర్ క్రైమ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. చైనా కేంద్రంగా నడిచే ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న నిందితులతో పాటు కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న వారితో కలిపి మొత్తం ఏడుగురిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ వెల్లడించారు.

▼ విశాఖకు చెందిన సూర్యమోహన్ గతంలో హాంకాంగ్, తైవాన్ దేశాలకు వెళ్లాడు. విశాఖకు వచ్చిన తర్వాత సాయిరామ్, గిరిష్‌లతో అతనికి పరిచయమైంది. సాయిరామ్‌కు సైబర్ మోసగాళ్లకు బ్యాంకు ఖాతాలు విక్రయించిన అనుభవం ఉంది. వీరు నగరంలో ఏఎన్ బీచ్ ఆసుపత్రి సమీపంలో ఒక ఫ్లాట్‌ను అద్దెకు తీసుకుని అలంకరణ సామగ్రి (కాస్మెటిక్స్)ను వియత్నాంకు ఎగుమతులు చేస్తున్నట్లు నమ్మించారు. కాల్‌సెంటర్ తరహాలో కార్యాలయాన్ని ఏర్పాటు చేసి విశాఖ కేంద్రంగా ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడటం, వచ్చిన నగదును అనధికార గేట్‌వేల ద్వారా చైనా సంస్థలకు బదిలీ చేయడం వంటి కార్యకలాపాలు నిర్వహించేవారు. ఇక్కడ ఆరుగురు యువతులు పనిచేస్తున్నారు. నగదు లావాదేవీల కోసం విశాలాక్షినగర్‌లో ఒక ఇంటిని అద్దెకు తీసుకున్నారు. బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ మోసాలకు సంబంధించి మధ్యవర్తులుగా మాత్రమే వ్యవహరించేవారు. వీరికి బ్యాంకు ఖాతాలు, పాస్ పుస్తకాలు, చెక్‌పుస్తకాలు, రిజిస్ట్రేషన్ కాని సిమ్‌లు, ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు ఉపయోగించే అధునాతన పరికరాలు, ఫోన్లు వంటివి కొరియర్ ద్వారా దిల్లీ నుంచి వచ్చేవి. బెట్టింగ్‌ల చెల్లింపులకు టీఆర్ఎక్స్ పేమెంట్ గేట్‌వేను ఉపయోగించేవారు. ఇందుకోసం దిల్లీ నుంచి వచ్చిన గుర్తింపులేని సిమ్‌లను ఉపయోగించారు. నిందితుల నుంచి ఒక డెస్క్‌టాప్, ల్యాప్‌టాప్‌లు 9, సీపీయూలు 8, మానిటర్లు 9, టీఆర్ఎక్స్ పరికరాలు 5, వైఫై రౌటర్ 1, సెల్‌ఫోన్లు 65, బ్యాంకు ఖాతాలు, చెక్ పుస్తకాలు 699, సిమ్‌కార్డులు 135, ద్విచక్రవాహనం, కారు, బంగారు ఉంగరాలు 3 స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుల కోసం గాలిస్తున్నామని, బాధితులను తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నామని సీపీ తెలిపారు.

అక్షరాస్యతా శాతం పెంచేలా చొరవ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో అక్షరాస్యతా శాతాన్ని పెంచేలా చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ విజయ అన్నారు. వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లాస్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. 2024-25 ఏడాదికి 11,900 మంది వయోజన విద్యను అందించమే లక్ష్యంగా పని చేయాలన్నారు. ఉల్లాస్ పథకంలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. అక్షరాస్యత శాతం తక్కువగా ఉన్న మండలాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పంచాయతీ రాజ్, గ్రామ సచివాలయం, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం, విద్యాశాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. విద్య ఉపసంచాలకులు వి.ఎస్.సుబ్రహ్మణ్యవర్మ, సహాయ సంచాలకులు డి.చిన్నికృష్ణ పాల్గొన్నారు.

వ్యవసాయ సిబ్బంది అందుబాటులో ఉండాలి

జిల్లా వ్యవసాయ అధికారులు, సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ విజయ ఆదేశాలు జారీచేశారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వ్యవసాయ అధికారులతో పొలంబడి, పొలం పిలుస్తోంది, పీఎం కిసాన్, ప్రకృతి వ్యవసాయంపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ-కేవైసీ నూరుశాతం పూర్తిచేయాలన్నారు. జిల్లాలో వరి మినహా మిగిలిన పంటల లక్ష్యాలు పూర్తి కావడం లేదన్నారు. ప్రకృతి వ్యవసాయ సమాచార పుస్తకాన్ని ఆవిష్కరించారు. జిల్లా వ్యవసాయ అధికారి మోహనరావు, ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ సీహెచ్.లచ్చన్న పాల్గొన్నారు. ఉద్యాన శాఖ అధికారులతో మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ ఉత్పత్తులకు బ్రాండింగ్ కల్పించి ఎగుమతులు ప్రోత్సహించాలన్నారు.

వాల్మీకి మహర్షి కారణజన్ముడు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: రాముని జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీరామ కథను రామాయణ మహాకావ్యంగా రచించిన వాల్మీకి మహర్షి కారణజన్ములన్నారు. రామయణ కావ్యం ప్రేమానురాగాలకు ప్రతీక అన్నారు. రామాయణంలోని సంఘటనలు మనిషి జీవితంలో, ప్రతి దశలో కనిపిస్తాయన్నారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి దయానిధి, బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి ఆర్. రాజేశ్వరి పాల్గొన్నారు. ఎస్పీ కార్యాలయంలో వాల్మీకి మహర్షి చిత్రపటం వద్ద అదనపు ఎస్పీ పూలమాల వేసి పూజలు చేశారు.



వాల్మీకి చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న జిల్లా కలెక్టర్ విజయ, చిత్రంలో జాయింట్ కలెక్టర్ జాహ్నవి



వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేస్తున్న అదనపు ఎస్పీ దేవప్రసాద్

విశ్రాంత తహసీల్దార్ సుధాకర్‌నాయుడు మృతి



విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశ్రాంత తహసీల్దార్, ఏపీ రెవెన్యూ సేవల సంఘం మాజీ నాయకులు లాలం సుధాకర్‌నాయుడు (65) గురువారం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కలెక్టరేట్ ప్రాంతంలో పుట్టి పెరిగిన ఆయన ఉద్యోగ విరమణ తర్వాత విశాలాక్షినగర్‌లో నివసిస్తున్నారు. 1984లో జూనియర్ సహాయకుడిగా రెవెన్యూశాఖలో చేరిన ఆయన అంచెలంచెలుగా ఎదిగారు. ఏపీఆర్ఎస్ఏ నగర కమిటీ కార్యదర్శి, హౌస్‌బిల్డింగ్ సొసైటీ డైరెక్టర్‌గా పనిచేశారు. సీతమ్మధార, విశాఖ రూరల్, పెందుర్తి మండల తహసీల్దార్‌గా పనిచేశారు. ఎన్నికల సమయంలో శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో కొంతకాలం విధులు నిర్వహించారు. తెదేపా సీనియర్ నేత లాలం భాస్కరరావుకు స్వయనా తమ్ముడు. సంఘం నాయకులు ఎస్.నాగేశ్వరరెడ్డి, సిహెచ్.వి.రమేష్, ఎం.మధుసూదనరావు, కేవీ ఈశ్వరరావు, పలువురు విశ్రాంత ఉద్యోగులు సుధాకర్‌నాయుడికి నివాళి అర్పించారు. శుక్రవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

తహసీల్దార్ అంబేడ్కర్‌పై క్రమశిక్షణ చర్యలు

ఆనందపురం, న్యూస్‌టుడే: గతంలో ఆనందపురం మండల తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించిన ఎస్.వి. అంబేడ్కర్‌పై ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు రెవెన్యూ శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ విధులు నిర్వర్తించిన సమయంలో ఆయనపై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణలకు సంబంధించి జిల్లా జాయింట్ కలెక్టర్ విచారణ చేపట్టి ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఆ మేరకు ఆయనకు మూడు వార్షిక గ్రేడ్ ఇంక్రిమెంట్లు నిలిపివేస్తూ ఉన్నతాధికారులు క్రమశిక్షణ చర్య తీసుకున్నారు. ప్రస్తుతం ఈయన అనకాపల్లి జిల్లాలో పనిచేస్తున్నారు.

బాలికపై అత్యాచారం

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ నగరంలోని మధురవాడలో ఆరేళ్ల బాలికపై ఇద్దరు బాలురు అత్యాచారానికి పాల్పడిన ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. పీఎం పాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొమ్మాది సమీప ప్రాంతానికి చెందిన ఇద్దరు బాలురు అదే కాలనీలోని ఆరేళ్ల బాలికపై మంగళవారం అత్యాచారానికి పాల్పడ్డారు. చిన్నారి తల్లిదండ్రులు బుధవారం ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	125	120
లైవ్	147	140
డ్రెస్డ్	213	250
స్కిన్‌లెస్	243	260

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా : **దేవర,** రామచంద్ర: **మార్టిన్** (ఉదయం, రెండోఆట), **రివైండ్** శ్రీ సత్య: **మా నాన్న సూపర్‌హీరో,** సత్యనారాయణ స్క్రీన్1: **విశ్వం,** స్క్రీన్2: **లవ్‌రెడ్డి** వెంకటేశ్వర: **వీక్షణం** పర్తిసాయి, షిర్డిసాయి: **వేట్టయన్ ద హంటర్,**
అచ్యుతాపురం: శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: **వేట్టయన్, విశ్వం** స్క్రీన్-2: **దేవర**

విరిగిన విద్యుత్తు స్తంభాల మార్పు

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: గాలులు, వర్షాలతో పూడిమడకలో ఆరు విద్యుత్తు స్తంభాలు నేలకూలాయి. గ్రామానికి సరఫరా నిలిచిపోవడంతో అంధకారం నెలకొంది. ఈ సమస్యను ఏఈ శ్రీనివాసరావును దృష్టికి మత్స్యకారులు తీసుకెళ్లడంలో ఆయన స్పందించారు. సిబ్బందిని ఏర్పాటుచేసి 24 గంటలు గడవకముందే స్తంభాలను తిరిగి ఏర్పాటు చేయించారు. గాలులు వీచే సమయంలో ప్రజలు స్తంభాలు, తీగలకింద ఉండకూదని ఏఈ సూచించారు.

ఎండిన కొమ్మలతో కలవరం

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పచ్చని చెట్లు పర్యావరణానికి ఎంతో ప్రయోజనకరమే కానీ.. దశాబ్దాల క్రితం పేట ప్రధాన రహదారికి ఇరువైపులా నాటిన భారీ చెట్లు నేడు ప్రమాదకరంగా మారాయి. పట్టణ పరిధిలో గతంలో రెండు కిలోమీటర్ల మేర ఇరువైపులా వృక్షాలు ఉండేవి. రోడ్డు విస్తరణలో భాగంగా అప్పట్లో వాటిని తొలగించారు. పాయకరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి జాతీయ రహదారి వరకు 50 మీటర్ల పరిధిలో చెట్లు వదిలేశారు. ఇవి చల్లటి నీడను ఇస్తున్నప్పటికీ ఎండు కొమ్మలు ప్రమాదకరంగా మారాయి. పెద్ద కొమ్మలు ఎండిపోయాయి. వర్షాలు, భారీగా గాలులు వీస్తున్న సమయంలో రోడ్డుపై పడుతున్నాయి. దీంతో వాహనచోదకులు, పాదచారులు గాయాల పాలైన సందర్భాలు గతంలో చోటు చేసుకున్నాయి. ఎండిన కొమ్మలు తొలగించేందుకు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు. దీనిపై ఈఓఆర్‌డీ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా చర్యలు చేపడతామని చెప్పారు.





పడకేసిన ప్లాంట్లు.. అనునిత్యం పాట్లు

నక్కపల్లి, న్యూస్‌టుడే:

పాఠశాలల్లో విద్యార్థులను తాగునీటి కష్టాలు వేధిస్తున్నాయి. వారికి పరిశుభ్రమైన తాగునీరు అందించేందుకు శుద్ధజల ప్లాంట్లు అందుబాటులో లేక కొన్ని చోట్ల.. పనిచేయక మరికొన్ని చోట్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



ఉపమాకలో పనిచేయని ప్లాంటు

నక్కపల్లి మండలంలో 73 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలుండగా, వీటి పరిధిలో సుమారు 8 వేల మంది వరకు చదువుకుంటున్నారు. చాలా బడుల్లో విద్యార్థులను తాగునీటి సమస్య వేధిస్తోంది. గత ప్రభుత్వం నాడు-నేడు పేరుతో అరకొరగా పాఠశాలలను అభివృద్ధి చేసి, వాటికి కేటాయించిన శుద్ధజల ప్లాంట్ల నిర్వహణ గాలి కొదిలేసింది. దీంతో ఇవన్నీ చాలాచోట్ల పనిచేయడంలేదు. ఇక నాడు-నేడుకు నోచుకోని బడుల్లో తాగునీటి సంగతి సరేసరి. ఇక్కడ నిత్యం విద్యార్థులు తమ ఇళ్లనుంచి సీసాలతో నీటిని తెచ్చుకోగా, ఉపాధ్యాయులు బయటినుంచి తమ సిబ్బందితో బిందెలతో తెచ్చి అందుబాటులో ఉంచుతున్నారు. కాగా వారు తెచ్చే నీరు సురక్షితమేనా అంటే ఎంత వరకనేది వారికే తెలియాలి. ముఖ్యంగా మండలంలో సుమారు 10 చోట్ల ప్లాంట్లు చాన్నాళ్ల కిందటే మరమ్మతులకు గురైనా వీటిని బాగు చేసేందుకు సంబంధిత గుత్తేదారులు ఎవరూ రాలేదు. మరోవైపు కొన్ని పాఠశాలలకు కొత్తవి వచ్చి నెలలు గడుస్తున్నా ఇన్‌స్టాల్ చేయక వినియోగంలోకి రాలేదు. ఫలితంగా చాలా పాఠశాలల్లో శుద్ధజల ప్లాంట్లు అలంకార ప్రాయంగా ఉన్నాయి. వీటిపై పై అధికారులకు ఎన్నిసార్లు తెలిపినా ఫలితం లేదని ఉపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు.



ఇంటి నుంచి తెచ్చుకున్న తాగునీటి బాటిళ్లతో బాలలు

ఆర్‌ఓ ప్లాంట్లు పనిచేయని బడులు: రాజయ్యపేట (ఉన్నత), గొడిచెర్ల (ఉన్నత), డీఎల్‌పురం (ఉన్నత), బంగారమ్మపేట, వేంపాడు, నెల్లిపూడి, నక్కపల్లి (మెయిన్), జానయ్యపేట, చినతీనార్ల, పెదతీనార్ల, బోయపాడు, అయ్యన్నపాలెం, మనబానవానిపాలెం, ఉపమాక, ఎన్. నర్సాపురం.

ప్లాంట్లు మంజూరై, వినియోగంలోకి రానివి: డీఎల్‌పురం-2, దోసలపాడు, చినదొడ్డిగల్లు 1, నక్కపల్లి ఈబీసీ, సారిపల్లిపాలెం, దొండవాక.

ఆర్వో ప్లాంట్లు లేని పాఠశాలలు: చీడిక, చీడిక కొత్తూరు, నక్కపల్లి(హెచ్‌సీ), సీతానగరం, వెలమ కొత్తూరు, చినరామభద్రపురం, డి. కొత్తూరు, గొడిచెర్ల, మూలపర్ర, పాటిమీద, వేంపాడు కొత్తూరు, అప్పల పాయకరావుపేట, పెదబోదిగల్లం, పెదదొడ్డిగల్లు, న్యాయంపూడి, కొర్రవానిపాలెం, పెదబోదిగల్లం(జడ్పీ ఉన్నత), జి. జానకీయమ్మపేట, తిరుపతిపాలెం, కొండవెనుకపాలెం, తమ్మయ్యపేట.

ఉన్నతాధికారులకు తెలియజేశాం



పనిచేయని శుద్ధజలప్లాంట్లకు సంబంధించి సంబంధిత సంస్థ ప్రతినిధులకు సమాచారం అందించాం. వారి నిర్వహణ కాల పరిమితి ముగిసిందని అంటున్నారు. అదేవిధంగా నూతన వాటిని బిగింపచేయడానికి సంబంధించి గుత్తేదారులకు సమచారం ఇచ్చినా స్పందించలేదు. వీటిపై ఉన్నతాధికారులకు సమాచారం అందించాం. తాగునీటి ప్లాంట్లు లేని పాఠశాలలకు కొత్తవి కోరుతూ ప్రతిపాదనలు చేశాం. ఇవి మంజూరైతే ఇబ్బందులు పూర్తిగా తీరతాయి. అంతవరకు బయటినుంచి నీటిని తెచ్చి మరిగించి ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించాం. - కె.నరేశ్, ఎంఈఓ

అచ్యుతాపురం.. బురదమయం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ పరిశ్రమలకు కేంద్రంగా విస్తరిస్తున్న అచ్యుతాపురాన్ని అధ్వాన పరిస్థితులు వీడడం లేదు. సరైన మురుగునీటి వ్యవస్థ లేకపోవడంతో వర్షం కురిస్తే కాలవల్లో చెత్తా చెదారంతోపాటు నల్లటి బురద రోడ్ల మీదకు కొట్టుకొస్తోంది. అచ్యుతాపురం- ఎలమంచిలి రోడ్డులో నల్లటి బురద రోడ్డపైకి వచ్చింది. పంచాయతీ అధికారులు దీన్ని తొలగించలేదు. ప్రయాణికులు, స్థానికులు, కొనుగోలుదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.



వార్డు సభ్యుల పాత్ర కీలకం

పాయకరావుపేట, నక్కపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని నర్సీపట్నం డీఎల్‌పీఓ మూర్తి తెలిపారు. మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం ఉప సర్పంచి, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నిధులు దుర్వినియోగం కాకుండా చూడాల్సిన బాధ్యత సభ్యులదేనన్నారు. నక్కపల్లి మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ రత్నం శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

రాంబిల్లి, మునగపాక, న్యూస్‌టుడే: గ్రామాల్లో పరిశుభ్రత, మౌలిక వసతుల కల్పన, రక్షిత తాగునీటి సరఫరాపై వార్డు సభ్యులు దృష్టి పెట్టాలని ఎంపీడీఓ ఎన్.జయమాధవి కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులపాటు నిర్వహించే ఉప సర్పంచులు, వార్డు సభ్యుల శిక్షణలో ఆమె మాట్లాడారు. మునగపాక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ శిరీష మాట్లాడుతూ చట్టంపై అవగాహన ఉంటేనే నిధులు సేకరణ, గ్రామాలను అభివృద్ధి చేయగలమని ఎంపీడీఓ వివరించారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చేతివృత్తుల వారిని ఆదుకుంటాం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: వెనుకబడిన వర్గాలకు ఆదుకునేలా ఆదరణ పథకం పునః ప్రారంభించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆలోచన చేస్తున్నట్లు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. గుండాల కూడలి వద్ద సమావేశ మందిరంలో గురువారం పీఎం విశ్వకర్మయోజన లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విశ్వకర్మ పథకంలో భాగంగా చేతివృత్తుల వారికి పరికరాలు అందించి శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. అనకాపల్లి పట్టణంలో వివిధ కులాలకు చెందిన 1,174 మందిని ఎంపిక చేసి కులవృత్తుల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల సంస్థ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ అర్హులైన కులవృత్తుల వారికి బ్యాంకు రుణాలు మంజూరు చేయించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, తెదేపా నాయకులు మాదంశెట్టి నీలబాబు, కొణతాల భాస్కరరావు, యూసీడీ అనకాపల్లి ప్రాజెక్టు పీడీ దొర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల, వేదికపై పీలా, పరమేశ్వరరావు తదితరులు

పాడి రైతులకు అన్యాయం చేయొద్దు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: లాభాల్లో ఉన్న విశాఖ డెయిరీ.. పాల సేకరణ ధరలను తగ్గించడం అన్యాయమని సీపీఐ జోనల్ కార్యదర్శి వై.ఎన్.భద్రం అన్నారు. అనకాపల్లి సీపీఐ గోవిందరావు భవనంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పాడి రైతులకు అన్యాయం చేసేలా యాజమాన్యం వ్యవహరిస్తోందన్నారు. డెయిరీ ఆస్తులను కాపాడాలని కోరారు.

పరిశ్రమల ఏర్పాటుకు సహకరించండి

నక్కపల్లి, న్యూస్‌టుడే: ఏపీఐఐసీ సేకరించిన భూముల్లో పరిశ్రమల ఏర్పాటుకు ప్రజలంతా సహకరించాలని తహసీల్దారు ఆర్.నరసింహమూర్తి కోరారు. మండలంలోని మూలపర్ర, డీఎల్‌పురం గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూములిచ్చిన రైతులకు సంబంధించి దాదాపుగా చెల్లింపులు పూర్తి చేశామని, ఎవరైనా అర్హత కలిగి, సమస్యలు పరిష్కారం కానివి ఉంటే వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతాల్లో అనేక పరిశ్రమలు రానున్నాయని, అందరూ సహకరిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందడంతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ప్యాకేజీ విషయంలో కటాఫ్ తేదీ మార్చడంతో పాటు పరిహారం పెంచాలంటూ విన్నవించారు. పలు వ్యక్తిగత సమస్యలు తహసీల్దారు దృష్టికి తీసుకువచ్చారు. కటాఫ్ తేదీ మార్చడం, పరిహారం పెంపుదల తమ చేతుల్లో లేదని, ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. సమావేశంలో ఉప తహసీల్దారు అన్నాజీరావు, నాయకులు గింజాల లక్ష్మణరావు, లొడగల చంద్రరావు, కొంద్ర కనకారావు, కిల్లాడ కృష్ణ, పెదపూడి శంకరరావు, గంటా నరసింగరావు, యేడిద సత్యనారాయణ, గింజాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



డీఎల్‌పురం సభకు హాజరైన గ్రామస్థులు

ఏడాది తిరక్కముందే గోతులు!

ఎలమంచిలి - అచ్యుతాపురం రహదారి దుస్థితి

ఎలమంచిలి, న్యూస్‌టుడే

జగన్ పాలనలో వేసిన రోడ్లు ఏడాది తిరక్కముందే రూపుకోల్పోయి గోతులు పడుతున్నాయి. అప్పట్లో పర్యవేక్షణ లోపంతో పనుల్లో నాణ్యత కరవైంది. రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన రోడ్లు దెబ్బతిని వాహన చోదకులను నరకాన్ని చూపిస్తున్నాయి. ఇందుకు నిదర్శనం ఎలమంచిలి - అచ్యుతాపురం ప్రధాన రహదారి. ఎలమంచిలి నుంచి రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ, స్టీల్‌ప్లాంట్‌కి వెళ్లే వారు ఈ మార్గంలోనే ప్రయాణిస్తారు. సెజ్ పరిశ్రమల్లో పనిచేసే వేలాది మంది కార్మికులు, ఉద్యోగులు ద్విచక్ర వాహనాలపై ఈ రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తారు. ఇంతటి ప్రాధాన్యం గల ఈ రోడ్డు గోతులు పడి అధ్వానంగా మారింది. ఈ మార్గంలో రోడ్డు పాడవ్వడంతో ఎక్కువగా ప్రమాదాలు జరిగేవి. చాలా మంది మృత్యువాత పడ్డారు. ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో అప్పటి వైకాపా ప్రభుత్వం రూ.అయిదు కోట్లు ఖర్చుచేసి పూర్తిస్థాయిలో కాకుండా బాగా దెబ్బతిన్న చోట్లలో కొత్తరోడ్డు వేసింది. రహదారులు భవనాల శాఖ ఆధ్వర్యంలో ఈ పనులు జరిగాయి. పనులు పూర్తయి ఏడాది గడవక ముందే చాలా చోట్ల రోడ్డు దెబ్బతింది. కొన్ని చోట్ల రోడ్డు పై పొర ఊడిపోయింది. కొన్ని చోట్ల గోతులు పడ్డాయి. అంచులు దెబ్బతిన్నాయి. రోడ్డు గోతులు పడటంతో ప్రయాణికులు, వాహనచోదకులు ఇబ్బందులు మళ్లీ మొదటికొచ్చాయి. కొన్నిచోట్ల తారు కరిగి రోడ్డు పైకి పొంగడంతో ద్విచక్రవాహనాలు ఇక్కడ ఎగిరి పడుతున్నాయి. దగ్గరికి వచ్చే వరకు దీన్ని గుర్తించలేకపోతున్నారు. రాత్రులు అయితే మరీ ఇబ్బందిగా మారింది. గోతులు పడిన రోడ్డుకి మరమ్మతులు చేయించాలని వాహనచోదకులు కోరుతున్నారు.



ఎలమంచిలి-నారాయణపురం మధ్య..



కొత్తూరు సమీపంలో దెబ్బతిన్న తారు రోడ్డు

గుత్తేదారులో మరమ్మతులు చేయిస్తాం

రోడ్డు వేసిన తరువాత రెండేళ్ల వరకు నిర్వహణ బాధ్యత గుత్తేదారుదే. దెబ్బతిన్న రోడ్డును పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. పనులు నాణ్యతతోనే చేయించారు. సామర్థ్యానికి మించి అధికలోడుతో బండరాళ్లను తరలిస్తున్న లారీల వల్ల రోడ్డు దెబ్బతిందని భావిస్తున్నాం. రవాణా శాఖ అధికారులు అధికలోడు లారీలు వెళ్లకుండా చర్యలు తీసుకోవాలి. - **రాధాకృష్ణ డీఈఈ రోడ్లు భవనాలశాఖ ఎలమంచిలి.**

అ వీ ఇ వీ

జనావాసాల మధ్య మద్యం దుకాణం వద్దు

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: శారదానగర్‌లో జనావాసాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటుపై స్థానికులు, వార్డు సభ్యులు, శారదానగర్ పరిరక్షణ సమితి ప్రతినిధులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సీఐ లక్ష్మణ నాయుడుకు గురువారం ఫిర్యాదు చేశారు. శారదానగర్‌లో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయకూడదని కొన్నేళ్ల క్రితమే పంచాయతీలో తీర్మానం చేశామని వార్డు సభ్యులు తాడి చక్రవర్తి, వేపాడ సత్తిబాబు తదితరులు తెలిపారు. నిర్వాహకులు దీనిని లెక్కచేయకుండా ఇక్కడే దుకాణం ఏర్పాటు చేస్తున్నారని ఆరోపించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

నక్కపల్లి: వేంపాడు ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను ఎంపీటీసీ సభ్యుడు కుంచె మధు తదితరులు గురువారం తనిఖీ చేశారు. మెనూలో త్వరలో మార్పులొచ్చే అవకాశముందన్నారు. పల్లా రాంబాబు, కమిడి బాబూరావు, నాగరాజు పాల్గొన్నారు.

మేకలకు నట్టల నివారణ మందులు

కోటవురట్ల, న్యూస్‌టుడే: గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు తప్పకుండా వాడాలని పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు పెట్ల నరేష్ అన్నారు. కోటవురట్ల శివారు గొల్లపేటలో గురువారం శిబిరం నిర్వహించి 1534 జీవాలకు నట్టల నివారణ మందులు వేశారు. మాకవరపాలెం, కోటవురట్ల మండలాల్లో 16,460 గొర్రెలు, 13,718 మేకకు మందు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

భారీ వర్షంతో జనజీవనానికి అంతరాయం

కోటవురట్ల, ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: కోటవురట్ల, ఎస్.రాయవరం మండలాల్లో గురువారం తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు భారీ వర్షం కురిసి జన జీవనానికి అంతరాయం కలిగింది. విద్యుత్తు సరఫరా నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి - 80085 74722
ఎలమంచిలి - 80085 74726
పాయకరావుపేట - 80085 74749

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: అనకాపల్లి మళ్లవీధిలో కొళాయి నుంచి బురద, నలకల నీరు వస్తుంది. సమస్యను పరిష్కరించగలరు. - సునీత, అనకాపల్లి

సమాధానం: సమస్య వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. - హరీష్, జీవీఎంసీ తాగునీటి విభాగం ఏఈ, అనకాపల్లి

ఇది చేతల ప్రభుత్వం

కశింకోట, న్యూస్‌టుడే: తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, రాష్ట్ర పట్టణ ఆర్థిక, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. గ్రామాల్లో రూ. 4500 కోట్లతో 30 వేల పనులు ప్రారంభించిన ఘనత కూటమి సర్కారుదన్నారు. పల్లె పండగలో భాగంగా చింతలపాలెం, గొబ్బూరు, ఏఎస్‌పేట, సోమవరం గ్రామాల్లో గురువారం వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఏడాదిలోపే జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా అనకాపల్లి నియోజకవర్గంలో ప్రతి ఇంటికి మంచినీటి కుళాయిలు ఏర్పాటు చేయిస్తామన్నారు. నాలుగు గ్రామాల్లో రూ. 34 లక్షలతో సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. భాజపా జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మండల తెదేపా అధ్యక్షులు కాయల మురళీధర్, కూటమి నాయకులు గొంతిన శ్రీనివాసరావు, గొంతిన రామోజీ, నిమ్మదల సన్యాసినాయుడు, కర్రి దుర్గునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లి మండలంలోని సీహెచ్‌బీ అగ్రహారం, న్యాయంపూడి, కాగిత, డీఎల్‌పురం, చందనాడ గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాన్ని ఎంపీడీఓ డి.సీతారామరాజు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. లక్షల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఆయా కార్యక్రమాల్లో కొప్పిశెట్టి వెంకటేష్, కురందాసు నూకరాజు, గింజాల లక్ష్మణరావు, కొప్పిశెట్టి కొండబాబు, వెదుళ్ల వరలక్ష్మి, రెడ్డివరహాలు, ఆకేటి గోవిందరావు, కొప్పిశెట్టి బుజ్జి, వెదుళ్ల పాపారావు, ఆకేటి శాంతి, మీగడ సత్తిబాబు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం, కోటవురట్ల, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం మండలం దార్లపూడి, బంగారమ్మపాలెం, పెదగుమ్ములూరు, పెదఉప్పలం, తిమ్మాపురం గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణాలకు, పలు అభివృద్ధి పనులకు తెదేపా మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, ఎంపీడీఓ సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. కోటవురట్ల మండలం రామచంద్రపురం, జగ్గంపేట, గొట్టివాడ, పొందూరు గ్రామాల్లో ఎంపీడీఓ కాశీవిశ్వనాథరావు, తెదేపా మండల అధ్యక్షుడు జానకి శ్రీను, జనసేన మండల అధ్యక్షుడు సింగంపల్లి శ్రీను సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: కుమారపురం, ఈదటం, కందిపూడి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు అధికారులు, కూటమి నాయకులు శంకుస్థాపనలు చేశారు. సుమారు రూ. 10 లక్షలతో గ్రామాల్లో సీసీ రహదారితో పాటు కాలువల నిర్మాణం చేపడుతున్నట్లు ఎంపీడీఓ జయప్రకాశరావు, మండల ఇంజినీరింగ్ అధికారి కచేరీ వెల్లడించారు. కుమారపురంలో తెదేపా నాయకులు మహేష్‌రెడ్డి, గోవిందరెడ్డి, అధికారులు హేమలత, అచ్యుత్ పాల్గొన్నారు



రహదారులకు శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే కొణతాల, పీలా గోవింద తదితరులు

రీ సర్వేలో అన్నీ తప్పులే

కోటవురట్ల, ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వే తప్పులతడకగా సాగిందని పలువురు రైతులు తహసీల్దార్ తిరుమల బాబుకు ఫిర్యాదు చేశారు. సుంకపూరులో భూ రీసర్వేపై గురువారం గ్రామసభ నిర్వహించారు. మరణించిన రైతుల పేరున నమోదు కావడం, భూ విస్తీర్ణంలో తేడాలు, పాసు పుస్తకాల్లో సర్వే నంబర్లు, రైతుల పేర్ల నమోదులో పొరపాట్లు, భూముల పంపకాల్లో తేడాలను సరిచేయాలని పలువురు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సర్పంచి చిటికెల లక్ష్మీ, జనసేన మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఎస్.రాయవరం మండలం ధర్మవరం-అగ్రహారం సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ రమేష్‌బాబు మాట్లాడుతూ దరఖాస్తు చేసిన ప్రతి రైతుకు 15 రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. గ్రామసభకు 59 ఫిర్యాదులు అందాయని తెలిపారు.

రాంబిల్లి, ఎలమంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: రాంబిల్లి మండలం చాటిమెట్ట రెవెన్యూలో తహసీల్దార్ ఎ.శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం రెవెన్యూ గ్రామసభ జరిగింది. విస్తీర్ణం తగ్గిపోవడం, పేర్లు పొరపాటుగా నమోదు తదితర సమస్యలపై 18 అర్జీలు అందాయి. జంపపాలెంలో గ్రామసభలో ఎలమంచిలి తహసీల్దార్ వరహాలు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించడానికే ఈ సభలు ఏర్పాటు చేశామన్నారు. సర్పంచి శిలపరశెట్టి దేవకి నాయుడు పాల్గొన్నారు.

నక్కపల్లి, కశింకోట, న్యూస్‌టుడే: రీసర్వే తప్పిదాలకు సంబంధించి రమణయ్యపేటలో గురువారం నిర్వహించిన గ్రామసభలో రైతుల నుంచి 16 వినతులు వచ్చాయి. తహసీల్దారు ఆర్.నరసింహమూర్తి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. కశింకోట మండలం కొత్తపల్లిలో నిర్వహించిన గ్రామసభలో 9 మంది నుంచి ఫిర్యాదులు అందాయి. వీటిలో రెండు మాత్రం తిరిగి సర్వే చేశారు. వర్షం కారణంగా మిగిలిన వాటిని సర్వే చేస్తామని హక్కుదారులకు తెలిపారు. రీసర్వే ఉప తహసీల్దారు భాస్కరరావు, మండల సర్వేయర్ రామారావు పాల్గొన్నారు.



రైతుల ఫిర్యాదులు పరిశీలిస్తున్న ఎస్.రాయవరం తహసీల్దార్ రమేష్‌బాబు

ఘనంగా వాల్మీకి జయంతి వేడుకలు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), అచ్యుతాపురం, న్యూస్‌టుడే: రామాయణం గురించి ప్రపంచానికి తెలియజేసిన వాల్మీకి మహర్షి అని వాల్మీకి బోయ యువజన సంక్షేమ సంఘం సభ్యులు కొనియాడారు. వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. అనకాపల్లిలో సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘం జిల్లా ఇన్‌ఛార్జ్ జయవరపు శ్రీనివాసరావు, మైపాలి పృథ్వీరాజు, రాజు, నాయుడు, అనపర్తి ఆదిబాబు, కొమ్మ పరమేష్, తాడి రవి పాల్గొన్నారు. నునపర్తి శివారు నడింపల్లిలో సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యాన వేడుకలు నిర్వహించారు. ఫౌండేషన్ సబ్ డివిజనల్ కన్వీనర్ రమణ, ధర్మప్రచారకులు కొల్లి అప్పారావు, మేడిశెట్టి వెంకటేష్, కొల్లి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట గ్రామీణం, ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: వాల్మీకి మహర్షి జయంతి వేడుక గురువారం పలు ప్రాంతాల్లో నిర్వహించారు. మంగవరంలో సమరసత ఫౌండేషన్ సభ్యులు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కట్టా వీరబాబు, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎస్.రాయవరం మండలం ధర్మవరం-అగ్రహారం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేశారు.



అనకాపల్లిలో వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సంఘం సభ్యులు

వేళాపాళా లేని విద్యుత్తు కోతలపై ఆందోళన

మునగపాక, న్యూస్‌టుడే: వేళాపాళా లేకుండా విద్యుత్తు కోతలు విధించడంపై వినియోగదారులు ఈపీడీసీఎల్ మునగపాక సెక్షన్ కార్యాలయాన్ని గురువారం ముట్టడించారు. మునగపాక ప్రధాన రహదారితోపాటు మదర్ థెరిస్సా విగ్రహం నుంచి నందికోవెల వరకు ఏర్పాటుచేసిన వీధిదీపాలు గత నాలుగు మాసాలుగా వెలగడం లేదని రైతు సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఆడారి మహేష్, దాడి శివ, దాడి ముసిలినాయుడు, మొల్లేటి సత్యనారాయణ అన్నారు. పలుమార్లు ఏఈ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని చెప్పారు. అనంతరం ఎల్ఐ రవికి వినతిపత్రం అందజేశారు. ఆడారి లక్ష్మణరావు, భీశెట్టి అప్పారావు, ఆడారి అప్పారావు, ఆడారి గోవిందఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.



సెక్షన్ కార్యాలయంలో సిబ్బందిని నిలదీస్తున్న రైతుసంఘం నాయకులు

వైభవంగా మరిడిమాంబ పండగ

కశింకోట, న్యూస్‌టుడే: కశింకోట మండలంలో మరిడిమాంబ అమ్మవారి పండగను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పంట పొలాల్లో ఉన్న అమ్మవారిని భక్తులు వర్షంలోనూ దర్శించుకొని పసుపు, కుంకుమ సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారి పల్లకీని గ్రామంలో ఊరేగించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, పీలా గోవింద సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు.



మరిడిమాంబకు భక్తుల పూజలు

నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలోని గవరపాలెం పీలావారి గౌరీ పరమేశ్వరుల నిలుపుదల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారిని కోటవీధి భోగలింగేశ్వరస్వామి ఆలయంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పీలావారి గౌరీ పరమేశ్వరుల ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయ గౌరవ అధ్యక్షుడు కొణతాల రఘునాథ్, శాశ్వత ఛైర్మన్ భీమరశెట్టి వరహానూకరాజు, అధ్యక్షులు భీమరశెట్టి శ్రీనివాసరావు, కార్యదర్శి బుద్ద బల్లమ్మనాయుడు పాల్గొన్నారు.



నిలుపుదల మహోత్సవంలో పాల్గొన్న భక్తులు


నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

కశింకోట, న్యూస్‌టుడే: తాళ్లపాలెం సెక్షన్, నర్సింగబిల్లి ఉపకేంద్రం పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల విద్యుత్తు సరఫరా ఉండదని ఈఈ ఎస్.రామకృష్ణ తెలిపారు.

ఎలమంచిలి గ్రామీణం, రాంబిల్లి: పులపర్తి, లక్కవరం, విశాఖ బయోమైరన్, ఏటికొప్పాక, ములకలాపల్లి, కొత్తలి, పేరంటాలపాలెం, మన్యంపాలెం ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు.. రాంబిల్లి మండలం కొత్తూరు విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని 19 గ్రామాలకు, మర్రిపాలెం, గోకివాడ, వెంకటాపురం ఫీడర్లతోపాటు ఆర్‌డబ్ల్యూఎస్ ఫీడర్‌కు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా విద్యుత్తు సరఫరా ఉండదు.


నక్కపల్లి, ఎస్.రాయవరం: వేంపాడు ఉపకేంద్రం పరిధిలోని వేంపాడు, డీఎల్‌పురం, చినదొడ్డిగల్లు, డొంకాడ, రేబాక, ముకుందరాజుపేట, నెల్లిపూడి, గునుపూడి గ్రామాలకు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తారు. కొరుప్రోలు సెక్షన్ పరిధిలోని గుడివాడ, గుర్రాజుపేట బంగారమ్మపాలెం పరిధిలోని పరిశ్రమలకు, చినఉప్పలం పరిధిలోని ఆక్వా చెరువులు, హేచరీలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్తు సరఫరా ఉండదు.











నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

నేడు విద్యుత్తు సరఫరా నిలిపివేత

కె.కోటపాడు, దేవరాపల్లి: విద్యుత్తు లైన్ల నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈలు చంద్రశేఖర్, శంకరరావు చెప్పారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కె.కోటపాడు, పినకోట పరిధిలో విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

వాలీబాల్ పోటీలకు ఎంపిక

గొలుగొండ, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు చోద్యం జడ్పీ పాఠశాల విద్యార్థులు ముగ్గురు ఎంపికయ్యారని పీఈటీ నూకరాజు చెప్పారు. దేవరాపల్లిలో ఈ నెల 16న జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో గీతిక, రేవతి, మనోజ్ రాణించారన్నారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, స్కూల్ కమిటీ ఛైర్మన్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, సిబ్బంది గురువారం విద్యార్థులను అభినందించారు.



పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తెరపై ఈనాడు
శ్రీకన్య **ఆడి1:** విశ్వం, కళ్లు కంపౌండ్ 1995, లవ్ రెడ్డి, వీక్షణం, **ఆడి2:** వెట్టయన్, ఇద్దరు, **ఆడి3:** దేవర, **ఆడి4:** రోబోట్, రివైండ్, జనక.. అయితే గనక, **రాజు:** వెట్టియన్, విశ్వం, **బంగార్రాజు:** దేవర

అ వీ ఇ వీ

పాలిటెక్నిక్ అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: పాలిటెక్నిక్ కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయని యువజన సర్వీసుల శాఖ రిసోర్స్ పర్సన్ బాబు చెప్పారు. అయ్యన్న విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులకు గురువారం యూత్ క్లబ్, నైపుణ్య శిక్షణపై అవగాహన కల్పించారు. విద్యా సంస్థల అధినేత ఖాసిం, డైరెక్టర్ నూర్జహాన్ పాల్గొన్నారు.

ఎమ్మెస్సీలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ఆర్గానిక్స్ కోర్సులో స్పాట్ ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్ చెప్పారు. పీజీ సెట్ అర్హత పత్రం, ఒరిజినల్స్, నకలు కాపీలతో విద్యార్థులు నేరుగా కళాశాలలో సంప్రదించవచ్చన్నారు.

గీత కార్మిక సంఘం ఎన్నిక ఏకగ్రీవం

కె.కోటపాడు, న్యూస్‌టుడే: కల్లుగీత కార్మిక సంఘం మండల కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. అధ్యక్షునిగా శెట్టి రమణ, ఉపాధ్యక్షునిగా సహదేవుడు, కార్యదర్శిగా కనకరాజు, సహాయ కార్యదర్శిగా నాగరాజు, కోశాధికారిగా భానుప్రసాదు, డైరెక్టర్లుగా వెంకటేశ్, రామునాయుడు, పైడిరాజు, వెంకటరావు, బెన్నయ్య, అప్పలరాజు, రమేశ్ ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శి యర్రా దేముడు పాల్గొన్నారు.

కేజీబీవీలో బాలికలకు వైద్య పరీక్షలు

రావికమతం, న్యూస్‌టుడే: గర్నికం కేజీబీవీ విద్యార్థినులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. చోడవరం సీహెచ్‌సీ గైనకాలజిస్ట్ స్మృతి, రావికమతం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాల్మీకి జయంతి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: వాల్మీకి జయంతిని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన రచించిన రామాయణం గొప్పతనాన్ని వివరించారు. గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారిణి దమయంతి, డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ రాజు, పెదబొడ్డేపల్లి జడ్పీ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

రావికమతం: టి.అర్జాపురం బాల వరసిద్ధి వినాయక ఆలయంలో అర్చకులు గుంటూరు లక్ష్మణరావు ఆధ్వర్యంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి జరిగింది. వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743
చోడవరం - 80085 74732
మాడుగుల - 80085 74737

నర్సీపట్నం, న్యూస్‌టుడే

సమస్య: స్థానిక పాత స్టేట్ బ్యాంకు రోడ్డులో ట్రాఫిక్ రద్దీతో వాహనదారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటి క్రమబద్ధీకరణకు ఇక్కడ పోలీసులు ఎవరూ కనిపించడం లేదు.

– ఎన్.రామ్మూర్తి, నర్సీపట్నం

★ అబీద్ కూడలిలో ఉన్న ట్రాఫిక్ పోలీసులను పాత స్టేట్ బ్యాంకు వద్ద విధులు చేపట్టేలా సర్దుబాటు చేస్తాం.

– ఉమామహేశ్వరరావు, పట్టణ సబ్‌ఇన్‌స్పెక్టర్, నర్సీపట్నం

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే


సమస్య: బంగారుమెట్ట ఫీడర్‌లో పరిధిలో త్రీఫేజ్ సరఫరా సరిగా ఉండటం లేదు. గురువారం చాలా ఇబ్బంది పడ్డాం. మెట్ట ప్రాంతాల్లో పొలాలకు నీరందక పంటలు ఎండిపోతున్నాయి. శాశ్వత పరిష్కారం చూపాలి.

– సాయం రఘునాథ్, రైతు, బంగారుమెట్ట


★ సాంకేతిక సమస్య వల్ల త్రీఫేజ్ సరఫరాలో గురువారం ఇబ్బంది ఏర్పడింది. వర్షాలు, గాలులు వచ్చినపుడు అంతరాయం కలుగుతోంది. మరోసారి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం.

– వెంకటేష్, లైన్‌మెన్


























పీజీలో ప్రవేశాలకు మంత్రితో మాట్లాడతా: అయ్యన్న

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ కళాశాలల్లో పీజీ సీట్లకు స్పాట్ అడ్మిషన్లు పొందేలా అవకాశం కల్పించాలని మంత్రి నారా లోకేశ్‌తో మాట్లాడతానని సభాపతి అయ్యన్నపాత్రుడు హామీ ఇచ్చారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గీతాకృష్ణ, డివిజన్ కార్యదర్శి రాయుడు తదితరులు గురువారం అయ్యన్నను కలిశారు. మెరిట్ లేని వారికి ప్రైవేట్ కళాశాలల్లో స్పాట్ అడ్మిషన్లు ఇస్తూ, ప్రభుత్వ కళాశాలల్లో ఇవ్వడం లేదని అయ్యన్న దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన అయ్యన్న ఏయూ ఉప కులపతితో ఫోన్లో మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలల్లో పీజీ సీట్లన్నీ భర్తీ చేయడంపై మంత్రితో మాట్లాడతానన్నారు. నర్సీపట్నంలో ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇవ్వాలని టౌన్ ప్లానింగ్ అధికారి సత్యనారాయణను ఆదేశించారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేయండి

మాకవరపాలెం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతో కలిసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ సూచించారు. మాకవరపాలెంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. నారాయణరాజుపేట, రామన్నపాలెం గ్రామాలను సందర్శించిన కేంద్ర బృందం సభ్యులకు అభివృద్ధి పనులపై అధికారులు తప్పుడు సమాచారం ఇచ్చారని మాజీ సర్పంచి వెంకటగిరి తదితరులు విజయ్ దృష్టికి తీసుకువచ్చారు.

అర్ధరాత్రి గ్రావెల్ అక్రమ తవ్వకాలు

✦ అడ్డుకున్న తమరానపాలెం రైతులు

రోలుగుంట, న్యూస్‌టుడే

అధికారం లేకున్నా వైకాపా నాయకుల్లో కొందరు గ్రావెల్ అక్రమ తవ్వకాలను యథేచ్ఛగా సాగిస్తున్నారు. అధికారులు, పోలీసుల కళ్లుగప్పి అర్ధరాత్రి సమయంలో టిప్పర్లలో తరలిస్తున్నారు. మండలంలోని రొంగలపాలెం శివారు తమరానపాలెం గ్రామానికి చెందిన కొంతమంది రైతులు బుధవారం అర్ధరాత్రి గ్రావెల్ తవ్వకాలు, రవాణాను అడ్డుకున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చి వారు వచ్చేలోగా అక్రమార్కులు అక్కడ్నుంచి ఉడాయించారు. రోలుగుంట - మాకవరపాలెం మండలాలకు సరిహద్దునున్న శీతనపాలెం సమీపంలోని కొండపై అదే ప్రాంతానికి చెందిన



కుసర్లపూడిలో గ్రావెల్ తవ్వకాలు జరిగే ప్రాంతం

వైకాపా నాయకుడి కన్నుపడింది. కొద్దినెలలుగా రోజూ రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము 4 గంటల వరకు పొక్లెయిన్‌తో తవ్వకాలు చేస్తూ టిప్పర్లతో తరలిస్తున్నారు. తవ్వకాలు జరిగే ప్రాంతానికి సమీపంలోని సాగు భూములు దెబ్బతింటుండటంతో బాధిత రైతులు వారం రోజుల కిందట తహసీల్దార్, పోలీసుస్టేషన్, గనులశాఖ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. ఫలితం లేకపోవడంతో బుధవారం అర్ధరాత్రి పొక్లెయిన్లు, టిప్పర్లను అడ్డుకున్నారు. ఫొటోలు తీసి పోలీసులకు అందజేశారు. గ్రావెల్ అక్రమ తవ్వకాలను అడ్డుకోకుంటే ఆందోళనకు దిగుతామని బాధిత రైతులు స్పష్టం చేశారు.



స్థానికులు అడ్డుకున్న లారీ నంబరు

దాడులపై వైద్యుల ఆందోళన



మాట్లాడుతున్న వైద్యులు సునీత, శ్రావణి, ఎంపీపీ శ్రీనివాసరావు

రోలుగుంట, న్యూస్‌టుడే: అర్ధరాత్రి సమయంలో కొందరు మద్యం మత్తులో ఆసుపత్రులకు వచ్చి సిబ్బందిపై దాడులకు పాల్పడుతున్నారని బుచ్చెంపేట, రోలుగుంట పీహెచ్‌సీ వైద్యులు సునీత, శ్రావణి ఆందోళన వ్యక్తం చేశారు. ఎంపీపీ శ్రీనివాసరావు అధ్యక్షతన గురువారం మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఏర్పాటైంది. కొంతకాలంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను వైద్యాధికారిణులు సమావేశంలో ఏకరువు పెట్టారు. స్థానిక నాయకులకు, పోలీసులకు ఫిర్యాదు చేసినా దాడులకు అడ్డుకట్ట పడలేదన్నారు. సిబ్బందికి రక్షణ లేకుంటే రాత్రి సమయాల్లో విధులు నిర్వహించలేమని స్పష్టంచేశారు. ప్రజాప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీపీ హామీ ఇచ్చారు. ఉపాధి హామీ పథకం ఏపీవో ఈశ్వరరావు మాట్లాడుతూ.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.34.26 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. కుసర్లపూడిలో జగనన్న కాలనీకి రహదారి, విద్యుత్తు, తాగునీటి వసతి కల్పించాలని సర్పంచి అప్పలనాయుడు కోరారు. జడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీరమణమ్మ, సర్పంచులు శ్రీనివాసరావు, కృష్ణంనాయుడు, ఎంపీడీవో నాగేశ్వరరావు, పీఆర్ ఏఈ ఉమామహేశ్వరుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమేష్‌బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమ్య, ఎంఈవో జగ్గారావు, వైస్ ఎంపీపీ సన్యాశినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సాగుతో ఉపాధి హామీ పథకం అనుసంధానం

చీడికాడ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని సాగుకు అనుసంధానం చేసిందని, ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. తురువోలు, చెట్టుపల్లి, పెదగోగాడ, జి.కొత్తపల్లి, చీడికాడ, మంచాల, కోనాం, ఎల్బీపట్నం, ఖండివరం గ్రామాల్లో గురువారం సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పండ్ల తోటల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు రాయితీలు అందజేయనున్నట్లు చెప్పారు. అడవిఅగ్రహారం, జి.కొత్తపల్లి, చినగోగాడ, బైలపూడి ప్రాంతాల్లో ఎంఎస్ఎం పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. చీడికాడలో జూనియర్ కళాశాల, క్రీడా మైదానం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు తాతయ్యబాబు, కూటమి నాయకులు పైలా ప్రసాదరావు, రాయపురెడ్డి కృష్ణ, సర్పంచులు, ఎంపీడీఓ హేమసుందరరావు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కాలి వేలికి గాయం కాగా.. తురువోలు ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకున్నారు.



తురువోలులో శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారు, పైలా తదితరులు

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

నర్సీపట్నం గ్రామీణం: చెట్టుపల్లిలో రూ.5 లక్షల అంచనాతో సీసీ రోడ్డు నిర్మాణానికి జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ శంకుస్థాపన చేశారు. సర్పంచి నాగరత్నం, నాయకులు బోళెం రామప్రసాద్, లాలం శ్రీరంగస్వామి, జనసేన నాయకుడు చక్రవర్తి పాల్గొన్నారు.



చెట్టుపల్లి పల్లెపండగ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ తదితరులు

మాకవరపాలెం: పెద్దిపాలెం, చామంతిపురం గ్రామాల్లో అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఇన్‌ఛార్జి ఎంపీడీవో సీతామహాలక్ష్మి, ఏపీవో వరలక్ష్మి, తెదేపా మండల అధ్యక్షుడు యర్రాపాత్రుడు, అల్లు రామునాయుడు, శ్రీను పాల్గొన్నారు.

నాతవరం: వెదురుపల్లి, చమ్మచింత, గుమ్ముడుగొండ, మాధవనగరం గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, కరక సత్యనారాయణ, పారుపల్లి కొండబాబు, పి.రమణ పాల్గొన్నారు.

అందరి సహకారంతో త్వరితగతిన పరిష్కారం

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: రెవెన్యూ అధికారులకు సహకరిస్తే భూసంబంధ సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని ఎమ్మెల్యే రాజు సూచించారు. చోడవరం పట్టణ శివారు అన్నవరం, వెంకయ్యగారిపేటలో గురువారం రీసర్వే గ్రామసభ నిర్వహించారు. అధికారులు కొత్తగా బదిలీపై వచ్చారని, రైతుల భూములు ఎవరివి ఎక్కడ ఉన్నాయో తెలియదన్నారు. తహసీల్దారు రామారావు, ఉప తహసీల్దారు సత్యనారాయణ, వీఆర్వోలు, సర్వేయర్లు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట: కరక గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించి రైతుల నుంచి వినతులు స్వీకరించారు. విస్తీర్ణంలో తేడాలు ఉన్నాయని, ఆధార్, ఫోన్ నంబర్ల వివరాల్లో తప్పులను సరిచేయాలని ఎక్కువ మంది కోరారని తహసీల్దార్ లక్ష్మి చెప్పారు. ఎంపీపీ నాగేశ్వరిదేవి, ఆర్ఐ శ్రావణ్, వీఆర్వో వెంకటరమణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు, రెవెన్యూ అధికారులు



రావికమతం సభలో పట్టాదారు పాసు పుస్తకం కోసం తహసీల్దారుకు అర్జీ ఇస్తున్న నారంశెట్టి పైడితల్లమ్మ

రావికమతం: రావికమతం గ్రామసభలో 51 వినతులు వచ్చాయని తహసీల్దారు వెంకటరమణ చెప్పారు. సర్పంచి మోదినాయుడు, ఎంపీటీసీ సభ్యులు నాగేశ్వరరావు, సూర్యనారాయణ, డీటీ నాయుడు, ఆర్ఐ సతీష్, వీఆర్వో శంకర్, సర్వేయరు సురేష్ పాల్గొన్నారు.

మాడుగుల గ్రామీణం: రీసర్వే పూర్తయిన గ్రామాల్లో తప్పులను రైతులు సరిదిద్దుకోవాలని తహసీల్దారు రమాదేవి సూచించారు. పోతనపూడి అగ్రహారం, భాగవతుల అగ్రహారంలో గ్రామసభ నిర్వహించి వినతులు స్వీకరించారు.

చీడికాడ: గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు ప్రసాదరావు సూచించారు. చీడిపల్లిలో రైతుల వినతులు స్వీకరించారు.

దేవరాపల్లి: తామరబ్బలో సర్పంచి టోకూరు రామకృష్ణ అధ్యక్షతన తహసీల్దారు లక్ష్మీదేవి గ్రామసభలో వినతులు స్వీకరించారు. సర్వేయర్ గోవిందరాజు, వీఆర్వో దేముడమ్మ, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం గ్రామీణం: నీలంపేట గ్రామసభకు ఆర్డీవో రమణ హాజరయ్యారు. భూమి యజమాని తామైతే వేరొకరి ఫొటోలు అప్‌లోడ్ అయ్యాయని ఐదుగురు రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. వాస్తవ విస్తీర్ణం కంటే రికార్డుల్లో తక్కువ విస్తీర్ణం చూపారని పలువురు పేర్కొన్నారు. తహసీల్దారు, సిబ్బంది పాల్గొన్నారు.

గొలుగొండ: పాతమల్లంపేటలో తహసీల్దార్ శ్రీనివాసరావు సదస్సు నిర్వహించి రైతుల నుంచి వినతులు స్వీకరించారు. సర్పంచి ఆదిలక్ష్మి, డీటీ చైనులు పాల్గొన్నారు.

పంచాయతీ తీర్మానంతోనే పనులు

మాకవరపాలెం, న్యూస్‌టుడే: గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు పంచాయతీ తీర్మానం తప్పనిసరని, ప్రతి మూడు నెలలకు ఒకసారి పంచాయతీ కార్యాలయంలో సమావేశమై చేపట్టాల్సిన పనులపై చర్చించాలని తెదేపా మండల అధ్యక్షుడు రుత్తల యర్రాపాత్రుడు సూచించారు. మండల పరిషత్తు కార్యాలయ సమావేశ మందిరంలో వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ తరగతులను ఇన్‌ఛార్జి ఎంపీడీవో సీతామహాలక్ష్మి గురువారం ప్రారంభించారు. శెట్టిపాలెం సర్పంచి అల్లు రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: పంచాయతీ పాలనపై ఉప సర్పంచులు, వార్డు సభ్యులు పట్టు సాధించాలని ఎంపీడీవో సాంబశివరావు సూచించారు. సూపరింటెండెంట్ అప్పలరాజు, ఈవోఆర్డీ రమణి పాల్గొన్నారు.

మాడుగుల గ్రామీణం: పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన పెంచుకునేందుకు శిక్షణ తరగతులు దోహదపడతాయని ఈవోఆర్డీ కరుణాకర్ అన్నారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ తరగతుల్లో అవగాహన కల్పించారు.

దేవరాపల్లి: గ్రామ పాలనపై వార్డు సభ్యులు పట్టు సాధించాలని ఎంపీపీ బుల్లిలక్ష్మి సూచించారు. మండల పరిషత్తు కార్యాలయంలో శిక్షణ తరగతులను ప్రారంభించారు. జడ్పీటీసీ సభ్యుడు సత్యం, ఎంపీడీవో సువర్ణరాజు, ఇన్‌ఛార్జి ఈవోఆర్డీ అప్పారావు పాల్గొన్నారు.

రోలుగుంట, న్యూస్‌టుడే: గ్రామాలను అభివృద్ధి పరచుకోవడంలో వార్డు సభ్యులు కీలకపాత్ర పోషించాలని ఎంపీడీవో నాగేశ్వరరావు సూచించారు. వార్డు సభ్యుల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతూ.. పంచాయతీలకు విడుదలవుతున్న నిధులు, చేపట్టాల్సిన పనులపై ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు.

భారీ వర్షంతో నిలిచిన విద్యుత్తు సరఫరా

నర్సీపట్నం, న్యూస్‌టుడే: వేకువజామున ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. మాకవరపాలెం, అమలాపురంలలో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. గబ్బాడ, మాకవరపాలెంలో స్తంభాలు నెలకొరిగాయి. చెట్ల కొమ్మలు విరిగి తీగలపై పడ్డాయి. ఈఈ రామకృష్ణారావు, డీఈఈ త్రినాథ్ సిబ్బందితో విద్యుత్తు సరఫరా పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.



విద్యుత్తు స్తంభం వేస్తున్న సిబ్బంది

ఎల్‌బీపట్నంలో కూలిన మర్రిచెట్టు

చీడికాడ, న్యూస్‌టుడే: ఈదురుగాలులతో కురిసిన వర్షానికి ఎల్బీపట్నంలో మరిడిమాంబ ఆలయం పక్కనున్న పెద్ద మర్రిచెట్టు కూలిపోయింది. పక్కనే ఉన్న పశువుల పాక, గడ్డివాముపై పడటంతో రైతు సింగంపల్లి భూలోకకు నష్టం వాటిల్లింది.



కొత్తకోటలో ఆందోళన చేస్తున్న స్థానికులు

మద్యం దుకాణం ఏర్పాటుపై అభ్యంతరం

రావికమతం, న్యూస్‌టుడే: కొత్తకోటలో ప్రార్థన మందిరం వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేసే విషయమై స్థానికుల నుంచి అభ్యంతరం వ్యక్తమైంది. వి.మాడుగుల మండలం జమ్మాదేవిపేటకు చెందిన వ్యక్తికి లాటరీలో మద్యం దుకాణం వచ్చింది. దుకాణం ఏర్పాటుకు చర్యలు చేపట్టగా స్థానికులు గురువారం ఆందోళనకు దిగారు. మహిళలు నక్కా లక్ష్మి, గరగా జ్యోతి, బోగది నాగ, విసారపు అప్పలరాజు మాట్లాడుతూ మరోచోట ఏర్పాటు చేసుకోవాలన్నారు.

మరింతగా రాణించాలి

నర్సీపట్నం అర్బన్: జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో రాణించి రజత పతకం సాధించిన మౌనికను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రాజు గురువారం అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.



మౌనికను అభినందిస్తున్న ప్రిన్సిపల్ రాజు

దుర్గమ్మ హుండీ ఆదాయం రూ.5.95 లక్షలు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక దుర్గామల్లేశ్వర స్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. 35 రోజులకు భక్తులు కానుకల రూపంలో రూ.5,95,089 సమర్పించారని ఈవో సాంబశివరావు చెప్పారు. దేవాదాయ శాఖ జిల్లా అధికారిణి సుధారాణి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, సీఐ రేవతమ్మ లెక్కింపును పర్యవేక్షించారు. అబీద్ కూడలిలోని నూకాంబికా అమ్మవారి ఆలయ నిర్మాణ పనులను కొత్త అమావాస్య నాటికి పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం సభాపతి అయ్యన్నను మర్యాదపూర్వకంగా కలిశారు.

గౌరమ్మ ఉత్సవాలకు శ్రీకారం

నాతవరం: మండల కేంద్రం నాతవరంలో గౌరమ్మ ఉత్సవాలకు గురువారం రాత్రి శ్రీకారం చుట్టారు. ఏటా విజయదశమి తర్వాత ఊరేగింపుగా వెళ్లి పొలంలోని వరి దుబ్బును తీసుకువచ్చి ఆలయంలో పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఉప సర్పంచి రాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ పరీక్షలు

మాడుగుల గ్రామీణం: గాదిరాయిలో పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం ఏర్పాటైంది. ఏడీఏ చిట్టినాయుడు, తెదేపా మండల అధ్యక్షుడు జగ్గారావు శిబిరాన్ని ప్రారంభించారు. సర్పంచి జగన్నాథం, వైద్యాధికారిణి సౌజన్య, మోదినాయుడు పాల్గొన్నారు.

గొలుగొండ: కొమిరి, కోదులపాలెం గ్రామాల్లో గొర్రెల మందకు ఏడీఏ రాంబాబు, మండల వైద్యాధికారి రమేష్ నట్టల నివారణ టీకాలు వేశారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	125	120
లైవ్	147	140
డ్రెస్డ్	213	250
స్కిన్‌లెస్	243	260

భారతమాతకు జైకొడుతూ..

జాతీయ పతాకానికి సెల్యూట్ చేయండి

పాక్ అనుకూల నినాదాలు చేసిన వ్యక్తికి బెయిలిస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశం

భోపాల్: పొరుగుదేశం పాకిస్థాన్ అనుకూల నినాదాలు చేసిన వ్యక్తికి బెయిల్ మంజూరు చేస్తూ మధ్యప్రదేశ్ హైకోర్టు షరతులు విధించింది. నిందితుడిలో దేశభక్తిని పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కేసు విచారణ ముగిసే వరకు ప్రతినెలా పోలీస్‌స్టేషన్‌లోని జాతీయ జెండాకు సెల్యూట్ చేయాలని, ఆ సందర్భంగా 'భారత్ మాతాకీ జై' అంటూ నినాదాలు చేయాలని జస్టిస్ డి.కె.పలివాల్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశించింది.



భోపాల్‌లోని మిస్రోడ్ పోలీస్ స్టేషన్ పరిధి నివాసి ఫైజల్ అలియాస్ ఫైజాన్ ఈ ఏడాది మే నెలలో పాక్ అనుకూల నినాదాలు చేశారంటూ పోలీసులు అరెస్ట్ చేశారు. భారత్‌ను అగౌరవపరుస్తూ, సమాజంలోని వివిధ వర్గాల మధ్య చిచ్చుపెట్టేలా వ్యవహరించారంటూ అభియోగాలను మోపారు. విచారణ సందర్భంగా రూ.50వేల పూచీకత్తుపై ఫైజాన్‌కు మధ్యప్రదేశ్ హైకోర్టు బెయిల్‌ను మంజూరు చేసింది. బెయిల్ షరతుల్లో భాగంగా ఫైజాన్ ప్రతినెలా తొలి, నాలుగో మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాలని ఆదేశించింది. అలా వెళ్లిన ప్రతిసారీ జాతీయ జెండాకు 21 సార్లు సెల్యూట్ చేయాలని, భారత్ మాతాకీ జై అని రెండుసార్లు నినదించాలని తెలిపింది.



ఈ నాలుగింటితో పరిపూర్ణ ఆనందం

జీవితంలో నాలుగు అంశాలుంటేనే పరిపూర్ణమైన ఆనందాన్ని పొందగలం. అవేంటంటే.. **1.**జీవితానికి ఓ పరమార్థం ఉండేలా చూసుకోవడం. **2.**ఎలాంటి పరిస్థితుల్లోనైనా ఆశావహ దృక్పథంతో ఉండటం. **3.**ప్రకృతితో అనుసంధానమై జీవించడం. **4.**ప్రేమపూర్వక బంధాలను కలిగి ఉండటం. ఇవి లేకపోతే ఎంత సంపద ఉన్నా, ఎన్ని సౌకర్యాలు ఉన్నా జీవితంలో వెలితి ఉంటుంది.

– డేనియల్ ఆరోస్, లైఫ్ కోచ్

పౌరసత్వ చట్టంలోని

సెక్షన్ 6(ఎ) రాజ్యాంగబద్ధమే

- **అస్సాం వలసలకు సంబంధించి సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కీలక తీర్పు**



దిల్లీ: అస్సాం వలసలకు సంబంధించి ఐదుగురు సభ్యుల సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం 4-1 మెజారిటీతో గురువారం కీలక తీర్పును వెలువరించింది. భారత పౌరసత్వ చట్టం-1955లోని సెక్షన్ 6(ఎ)కు రాజ్యాంగబద్ధత ఉందని స్పష్టం చేసింది. సెక్షన్ 6(ఎ) ప్రకారం.. జనవరి 1, 1966 - మార్చి 25, 1971 మధ్య అస్సాంలోకి ప్రవేశించిన వలసదారులు భారత పౌరసత్వానికి అర్హులు. బంగ్లాదేశ్ వలసలతో అస్సాంలో పెరుగుతున్న ఉద్రిక్తతలను చల్లార్చడానికి 1985లో ఓ ఒప్పందం జరిగింది. దీనిపై కేంద్రం తరపున నాటి ప్రధాని రాజీవ్‌గాంధీ.. అల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ (అసు) ప్రతినిధులు సంతకం చేశారు. ఈ ఒప్పందం ఆధారంగా పౌరసత్వ చట్టానికి సవరణ చేసి సెక్షన్ 6(ఎ)ను చేర్చారు. కేవలం అస్సాం రాష్ట్రానికి మాత్రమే వర్తించేలా చేసిన ఈ సవరణ రాజ్యాంగ విరుద్ధమని, రాజ్యాంగ పీఠికలోని సౌభ్రాతృత్వ భావనకు వ్యతిరేకమని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌ను గురువారం భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ మనోజ్ మిశ్రల ధర్మాసనం తిరస్కరించింది. అయితే ధర్మాసనంలోని జస్టిస్ జె.బి.పార్దీవాలా మాత్రం సెక్షన్ 6(ఎ) ఏకపక్షంగా ఉందని, రాజ్యాంగపరంగా చెల్లుబాటు కాదంటూ మైనారిటీ తీర్పును వెలువరించారు. ఈ సందర్భంగా సీజేఐ "అక్రమ వలసలకు అస్సాం ఒప్పందం ఓ రాజకీయ పరిష్కారం. అదే సమయంలో సెక్షన్-6ఎ అనేది చట్టబద్ధమైన మార్గం. ఈ నిబంధనలు రూపొందించడానికి మెజార్టీతో కూడిన పార్లమెంటుకు శక్తి ఉంది. మానవీయ ఆందోళనలను పరిష్కరించడంతోపాటు.. స్థానికుల ప్రయోజనాలను కాపాడే సమతుల్యత ఈ సెక్షన్‌కు ఉంది. ఇక దీనిలోని కటాఫ్ డేట్‌గా నిర్ణయించిన 1971 మార్చి 25 అనేది సరైనదే. ఎందుకంటే అప్పటికే బంగ్లాదేశ్ యుద్ధం ముగిసింది. బంగ్లాదేశ్ యుద్ధం నేపథ్యంలోనే ఈ సెక్షన్ తీసుకొచ్చిన విషయాన్ని ఇది చెబుతోంది. ఈ సెక్షన్ అంత ఎక్కువగా జనాభాను కలుపుకోలేదు.. మరీ తక్కువగానూ విలీనం చేసుకోలేదు" అని పేర్కొన్నారు. అక్రమ వలసలు అరికట్టేందుకు ఇంకా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అన్నారు. కేవలం అస్సాంకే ఈ నిబంధన పరిమితం చేయడాన్ని కూడా సీజేఐ సమర్థించారు. మిగతా రాష్ట్రాల కంటే అస్సాం ఎక్కువగా వలసలతో ప్రభావితమవుతుందని.. కాబట్టి ఇందులో హేతుబద్ధత ఉందని తెలిపారు.

బాంబు బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలే

- **కేంద్ర మంత్రి రామ్మోహన్ స్పష్టీకరణ**

దిల్లీ: జాతీయ, అంతర్జాతీయ విమానాలకు కొద్ది రోజులుగా వస్తున్న బాంబు బెదిరింపులను నియంత్రించేందుకు కేంద్రం కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. ఇందుకోసం ఇప్పటికే ఉన్న నిబంధనలను సవరించే యోచనలో ఉన్నట్లు పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఉత్తుత్తి బెదిరింపు ఘటనలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వరుస బాంబు బెదిరింపుల వెనుక కుట్ర దాగి ఉందా అన్న ప్రశ్నకు.. 'ప్రస్తుతం వచ్చినవన్నీ వ్యక్తులు, మైనర్లకు సంబంధించిన బెదిరింపులే' అని తెలిపారు. బాంబు బెదిరింపులకు పాల్పడిన వారిపై విమానయాన నిషేధం విధించే ఆలోచన ఉందని వివరించారు.

★ ముంబయి-లండన్ ఎయిరిండియా విమానానికి బాంబు బెదిరింపు రావడంతో ముందు జాగ్రత్త చర్యగా రాయల్ ఎయిర్ ఫోర్స్ టైఫూన్ ఫైటర్ జెట్ రంగంలోకి దిగింది. గురువారం మధ్యాహ్నం దానిని పంపినట్లు ఆ సంస్థ అధికార ప్రతినిధి వెల్లడించారు. ఆ తర్వాత ఎయిరిండియా విమానం లండన్‌లో సురక్షితంగా దిగింది.

ఝార్ఖండ్ తొలి విడతకు నేటి నుంచి నామినేషన్లు

రాంచీ, చండీగఢ్: ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల తొలి విడత నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం ప్రారంభం కానుంది. 43 నియోజకవర్గాలకు నవంబరు 13న జరిగే పోలింగ్ కోసం ఈ నెల 25 వరకూ నామినేషన్లను స్వీకరిస్తారు. ప్రతి రోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల మధ్య నామినేషన్ల దాఖలును అనుమతిస్తారు. ఈ నెల 30లోగా నామినేషన్లను ఉపసంహరించుకోవచ్చు.

★ హరియాణా కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి కెప్టెన్ అజయ్ సింగ్ యాదవ్ పార్టీని వీడారు. ఏఐసీసీ ఓబీసీ ఛైర్మన్ పదవికీ ఆయన రాజీనామా చేశారు.

భర్త ఆగ్రాలో.. భార్య దిల్లీలో ఆత్మహత్య

- **ఇద్దరూ.. ఎయిర్‌ఫోర్స్, ఆర్మీ అధికారులు**
- **విషాదంగా ముగిసిన ప్రేమపెళ్లి**

దిల్లీ: భారత సాయుధ దళాల్లో పనిచేస్తున్న ఓ జంట ఒకరోజు వెనుకాముందు వేర్వేరు నగరాల్లో ఆత్మహత్యకు పాల్పడింది. వీరిద్దరిదీ ప్రేమపెళ్లి కావడం గమనార్హం. వాయుసేన, ఆర్మీలలో విధులు నిర్వహిస్తున్న వీరి విషాదాంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనదయాళ్ దీప్ (32) ఆగ్రాలో ఐఏఎఫ్ ఫ్లైట్ లెఫ్టినెంటుగా పనిచేస్తున్నారు. అక్కడే సైనిక ఆసుపత్రిలో ఆయన భార్య రేణు తన్వర్ ఆర్మీ కెప్టెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. అక్టోబరు 14న (సోమవారం) తన తల్లికి వైద్యచికిత్స కోసం తన్వర్ దిల్లీకి వెళ్లారు. ఈ నేపథ్యంలో అదేరోజు రాత్రి భోజనం తర్వాత గదిలోకి వెళ్లిన దీన్‌దయాళ్.. మంగళవారం ఉదయం బయటకు రాకపోవడంతో సహోద్యోగులు క్వార్టర్సు తలుపు పగలగొట్టి చూడగా ఉరి వేసుకుని కనిపించారు. మరోవైపు.. తన్వర్ కూడా దిల్లీ కంటోన్మెంటులోని అధికారుల మెస్‌లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మంగళవారం ఆమె దిల్లీ ఎయిమ్స్‌లో ఉండగా భర్త మరణం గురించి తెలిసి షాక్‌కు గురయ్యారని, ఆ తర్వాత అతిథిగృహానికి వెళ్లిపోయినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. రేణు తన్వర్ బలవన్మరణానికి పాల్పడినట్లు దిల్లీ డీసీపీ సురేంద్రకుమార్ చౌదరి ధ్రువీకరించారు. పోలీసులు తన్వర్ మృతదేహం పక్కన లేఖను స్వాధీనం చేసుకున్నారు. తన మరణానికి ఎవరూ కారణం కాదని పేర్కొన్న ఆమె.. భర్త మృతదేహంతో కలిపి అంతిమ సంస్కారాలు చేయాలని అందులో కోరారు.

హసీనాపై అరెస్టు వారెంట్

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా సహా ఆమె పార్టీ అవామీ లీగ్‌కు చెందిన అగ్రనాయకులు 45 మందిపై అరెస్టు వారెంట్ జారీ అయింది. నవంబరు 18లోగా వారందరిని తమ ఎదుట హాజరుపరచాలని దేశ ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్ (ఐసీటీ) ఛైర్మన్ జస్టిస్ మహ్మద్ గోలం మొర్తుజా మజుందార్ తన ఆదేశాల్లో పేర్కొన్నారు. రిజర్వేషన్లపై విద్యార్థుల నిరసనలు హింసాత్మకంగా మారడంతో.. ప్రధానిగా ఉన్న షేక్‌హసీనా పదవి నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే. తర్వాత నుంచి ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. జులై 15 నుంచి ఆగస్టు 5 వరకు జరిగిన మారణహోమం, హత్యలు, ఇతర నేరాల ఆరోపణలపై హసీనా, ఆమె పార్టీ నేతలు, 14 పార్టీల మిత్రపక్ష నేతలకు వ్యతిరేకంగా ఐసీటీకి 60 ఫిర్యాదులు అందాయి. వాటిపై ట్రైబ్యునల్ దర్యాప్తు ప్రారంభించింది. ఈ క్రమంలోనే తాజా పరిణామం చోటుచేసుకుంది.

హరియాణా సీఎంగా సైనీ ప్రమాణం

- **హాజరైన మోదీ, అమిత్ షా, చంద్రబాబు, ఎన్డీయే నేతలు**



సీఎంగా ప్రమాణం చేసిన సైనీకి మోదీ ఆశీస్సులు. చిత్రంలో గవర్నర్ దత్తాత్రేయ

చండీగఢ్: హరియాణా ముఖ్యమంత్రిగా నాయబ్ సింగ్ సైనీ గురువారం పంచకులాలో ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎన్డీయే నేతలు, భారీ జనసందోహం మధ్య ప్రమాణం చేశారు. ఆయనతో గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రమాణం చేయించారు. దసరా మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున జనం తరలివచ్చారు. సైనీతోపాటు 13 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. గురువారం వాల్మీకి జయంతి కావడం విశేషం. ప్రమాణం అనంతరం సైనీకి ప్రధాని మోదీ అభినందనలు తెలిపారు. 54ఏళ్ల సైనీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఇది రెండోసారి. గత మార్చిలో మనోహర్‌లాల్ ఖట్టర్‌ను మార్చి ఆయనను భాజపా అధిష్ఠానం సీఎంను చేసింది. ఇటీవల జరిగిన హరియాణా ఎన్నికల్లో విజయం సాధించడంతో మరోసారి ముఖ్యమంత్రి అయ్యారు. మంత్రులుగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అనిల్ విజ్, అహిర్ వర్గం నేత రావ్ నర్బీర్ సింగ్, జాట్ నేత మహీపాల్ దండా, భాజపాలో చేరిన కాంగ్రెస్ నేత శ్రుతి చౌధరి, తొలిసారి ఎమ్మెల్యే అయిన ఆర్తి సింగ్ తదితరులున్నారు.

ప్రమాణ స్వీకారానికి హాజరైన వారిలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, జేపీ నడ్డా, ముఖ్యమంత్రులు యోగి ఆదిత్యనాథ్, హిమంత బిశ్వ శర్మ, విష్ణుదేవ్ సాయ్, భూపేంద్ర పటేల్, పుష్కర్ సింగ్ ధామి తదితరులు హాజరయ్యారు.

ప్రమాణస్వీకారాన్ని అడ్డుకోవాలన్న పిటిషనరుపై సుప్రీం ఆగ్రహం

దిల్లీ: హరియాణా ముఖ్యమంత్రిగా సైనీ ప్రమాణ స్వీకారాన్ని అడ్డుకోవాలని కోరిన పిటిషనరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. 'ఇదేమి పిటిషన్.. దీనిని డిస్మిస్ చేస్తున్నాం' అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. హరియాణా ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఈవీఎంలలో లోటుపాట్లు చోటుచేసుకున్నాయని పిటిషనరు తరఫు న్యాయవాది కోర్టుకు తెలపగా.. ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎన్నికైన ప్రభుత్వ ప్రమాణ స్వీకారాన్ని ఎలా అడ్డుకోగలమని ప్రశ్నించింది.

ఆసియా పసిఫిక్ ఏబీసీ ఛైర్మన్‌గా మసానీ



దిల్లీ: భారత ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) సెక్రటరీ జనరల్ హెచ్‌బీ మసానీ.. ఆసియా పసిఫిక్ ఆడిట్ బ్యూరోస్ ఆఫ్ సర్టిఫికేషన్ (ఏపీఏబీసీ) అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా తిరిగి ఎన్నికయ్యారు. ఆయన ఈ పదవిని చేపట్టడం ఐదోసారి. ఈ మేరకు ఏబీసీ ఓ ప్రకటన విడుదల చేసింది. ఇటీవల జరిగిన ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఆడిట్ బ్యూరోస్ ఆఫ్ సర్టిఫికేషన్ (ఐఎఫ్ఏబీసీ) సర్వసభ్య సమావేశంలో మసానీ ఐఎఫ్ఏబీసీ ఎగ్జిక్యూటివ్ బోర్డు మెంబర్ (గౌరవ కోశాధికారి)గా కూడా వరుసగా తొమ్మిదోసారి ఎన్నికయ్యారు. ఐఎఫ్ఏబీసీ ఎగ్జిక్యూటివ్ బోర్డులో భారత్‌తోపాటు, ఆస్ట్రియా, బ్రెజిల్, ఫ్రాన్స్, జర్మనీ, రొమేనియా, స్పెయిన్, బ్రిటన్, అమెరికా దేశాల బ్యూరోల ప్రతినిధులు ఉన్నారు. 2008 నుంచి ఐఎఫ్ఏబీసీ కార్యనిర్వాహక మండలిలో ఏబీసీ-ఇండియాకు మసానీ ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

హవాలా కేసులో తమన్నాను విచారించిన ఈడీ



గువాహటి: నగదు అక్రమ చలామణి (మనీ లాండరింగ్) కేసులో సినీనటి తమన్నా భాటియాను గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు విచారించారు. బిట్‌కాయిన్లు, ఇతర క్రిప్టోకరెన్సీల మైనింగ్ పేరిట పలువురిని మోసగించిన వ్యవహారంలో 'హెచ్‌పీజడ్ టోకెన్' మొబైల్ యాప్ పాత్ర ఉంది. ఈ కేసులో వెలుగులోకి వచ్చిన మనీలాండరింగ్ ఆరోపణలపై తమన్నా వాంగ్మూలాన్ని నమోదు చేసినట్లు ఈడీ విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపింది. యాప్ కంపెనీ నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్నందుకు తమన్నా కొంత సొమ్ము తీసుకున్నారని, అయితే ఆమెపై ఎటువంటి నేరారోపణ అభియోగాలు మోపలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి.

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - విశ్వం

డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు

కడప క్రీడలు: ఏసీఏ అండర్-14 మల్టీడే క్రికెట్ టోర్నీలో మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. కడప వైఎస్ఆర్ఆర్-ఏసీఏ స్టేడియంలో కడపతో జరిగిన మ్యాచ్‌లో విశాఖపట్నానికి మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన విశాఖ జట్టు నిర్ణీత 39 ఓవర్లలో 234/5 స్కోరు చేసింది. రామ్‌చరణ్ 80, వినోద్ 52, తమన్‌రెడ్డి 51 పరుగులు చేయగా, సాయికృష్ణచైతన్య 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన కడప జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 39 ఓవర్లలో 98/4 స్కోరు చేసింది.

పెందుర్తి

మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ

అక్కిరెడ్డిపాలెం: మహిళ మెడలో పుస్తెల తాడు చోరీ అయిన ఘటనపై గురువారం బాధితులు తెలిపిన వివరాలివి. నాతయ్యపాలెంలోని చివరి వీధిలో గేదెల దుర్గారావు, పైడమ్మ దంపతులు నివాసం ఉంటున్నారు. ఉదయం 6 గంటల సమయంలో పైడమ్మ ఇంటి ఎదుట పువ్వులు కోస్తున్నారు. ఆ సమయంలో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు యువకులు ఏదో చిరునామా వివరాలు అడిగారు. ఆమె సమాధానం చెప్పేలోపే... మెడలో ఉన్న 4 తులాల బంగారు పుస్తెల తాడును బలవంతంగా లాక్కెళ్లిపోయారు. సమాచారం అందుకున్న గాజువాక క్రైమ్ సీఐ శ్రీనివాస్ తమ సిబ్బందితో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అ వీ ఇ వీ

పీఏసీఎస్ సభ్యులకు ఈ-కేవైసీ తప్పనిసరి

సబ్బవరం: శ్రీదుర్గాంబ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో (పీఏసీఎస్) సభ్యత్వం ఉన్న ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని సొసైటీ కార్యదర్శి గొంప రమణ తెలిపారు. లేని పక్షంలో ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు దక్కవన్నారు. ప్రస్తుతం ఈ సంఘంలో సభ్యుల వివరాలను డిజిటలీకరణ జరుగుతుందన్నారు. కాబట్టి పూర్తి వివరాలతో పత్రాలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే అనేక మాధ్యమాల ద్వారా సభ్యులకు అవగాహన కల్పించినప్పటికీ ఇంతవరకు 40 శాతం సభ్యులు మాత్రమే నమోదు చేయించుకున్నారని తెలిపారు. మిగిలినవారు ఈనెల 30లోగా ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. సభ్యులు వెంటనే పట్టాదారు పాస్ పుస్తకం లేదా 1బి లేదా భూమి పత్రాల నకళ్లతో పాటు ఆధార్, రేషన్ కార్డు, పాన్‌కార్డు, నామినీ పేరు తదితర వివరాలకు చెందిన జెరాక్సు కాపీలను కార్యాలయంలో అందించాలని వివరించారు.

లైసెన్సు లేకుండా తరలిస్తున్న బాణసంచా స్వాధీనం

పెందుర్తి, న్యూస్‌టుడే: దీపావళి పండగను పురస్కరించుకుని ముందుగానే బాణసంచా కొనుగోలు చేసి నిల్వ చేయడానికి చేసిన ప్రయత్నాన్ని పెందుర్తి పోలీసులు భగ్నం చేశారు. పెందుర్తి కూడలి వద్ద వాహన తనిఖీల్లో భాగంగా విక్రయాలకు లైసెన్సు లేకుండా బాణసంచా తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కె.వి.సతీశ్‌కుమార్ తెలిపారు. విజయనగరం నుంచి ముగ్గురు యువకులు సుమారు రూ.50 వేలు విలువైన బాణసంచా సామగ్రిని పెందుర్తి తీసుకువస్తుండగా తనిఖీ చేసి సరకు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సరకు తరలిస్తున్న వారిపై సైతం నిబంధనలు పాటించని నేపథ్యంలో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వైభవంగా స్వర్ణ పుష్పార్చన

సింహాచలం: సిరులొలికే సింహాద్రినాథుడికి గురువారం స్వర్ణ పుష్పార్చన ప్రత్యేక పూజా కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. అర్చకులు వేకువజామున స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆరాధన, బాలభోగం సేవలు జరిపారు. బంగారు సంపెంగ పుష్పాలతో దేవతామూర్తులకు అష్టోత్తర శతనామార్చన జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణోత్సవాన్ని కమనీయంగా జరిపించారు.

వాల్మీకి మహర్షి జయంతి

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం నాయుడుపాలెం కూడలిలో గురువారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పరవాడ ఖండం ధర్మప్రచారక్ వెన్నెల అప్పలనాయుడు, సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు పైలా తాతబాబు, చుక్కనాయుడు, దుంగల అక్కునాయుడు, బుజ్జి, నారాయణరావు, అప్పలనాయుడు, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.


వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న అప్పలనాయుడు తదితరులు

రహదారులు మాయం.. ఒళ్లంతా హూనం..


పరవాడ మండల పరిషత్తు కూడలిలో దెబ్బతిన్న రహదారి

పరవాడ, న్యూస్‌టుడే

గత వైకాపా పాలనలో అంతులేని అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి పనులు అటకెక్కాయి. సకాలంలో నిధులు విడుదల కాకపోవడంతో పరవాడ మండలంలోని వివిధ రహదారులు శిథిలావస్థకు చేరాయి. ఎక్కడికక్కడ గుంతలతో ప్రయాణం నరకం చూపిస్తోంది. దీనికి తోడు ఇటీవల కురుస్తున్న వర్షాలకు మరింత అధ్వానంగా తయారయ్యాయి. ఫలితంగా రోడ్డేదో.. గుంత ఏదో తెలియక వాహనచోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. రహదారులను బాగు చేయాలని గత ఐదేళ్ల కాలంలో వైకాపా నాయకులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో రహదారులకు ఈ దుస్థితి ఏర్పడిందని ప్రజలు వాపోతున్నారు. దీంతో అవస్థలు పడుతూ ప్రయాణం సాగించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వేలాదిమంది రాకపోకలు సాగించే ప్రధాన రహదారులను గాలికొదిలేశారు. పరవాడ మండల పరిషత్తు కూడలి, పరవాడ సబ్‌స్టేషన్ కూడలి, వెన్నెలపాలెం నుంచి ఎన్టీపీసీకి వెళ్లే రహదారి, ఈ.భోనంగి తిరుపతి ఫ్యూయల్స్ కంపెనీ వద్ద, జాజులవానిపాలెం నుంచి కలపాక మార్గం, వాడచీపురుపల్లి - వెంకటాపురం రహదారి, మెట్టపాలెం-పాతరాజానపాలెం, బొట్టవానిపాలెం - రేఖవానిపాలెం దారిలో గుంతలు పడడంతో పాటు వర్షపునీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఒళ్లంతా హూనం కావడంతో పాటు తరచూ వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లను బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


బొట్టవానిపాలెం నుంచి రేఖవానిపాలెం వెళ్లే మార్గంలో ఇలా..


ఈ.భోనంగి తిరుపతి ఫ్యూయల్స్ కంపెనీ వద్ద భారీ గుంత

గ్రామ రెవెన్యూ సదస్సులకు ఆదరణ

సబ్బవరం, న్యూస్‌టుడే: విప్పాక అగ్రహారంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ రెవెన్యూ సదస్సుకు ఆదరణ పెరిగింది. ఇటీవల కాలంలో రీసర్వే జరిగినపుడు అనేక తప్పులు దొర్లాయి. వీటిని సవరించుకునేందుకు రైతులు వరుసలు కట్టారు. దరఖాస్తులు ఇచ్చి తమ భూములకు సరైన రికార్డులు ఇవ్వాలని తహసీల్దారు బి.చిన్నికృష్ణను కోరారు. ఈ రెవెన్యూ గ్రామంలో పట్టా భూమి 75.95 ఎకరాలు ఉండగా రీసర్వే అనంతరం 76.26 ఎకరాలు నమోదైందని.. మొత్తం ప్రభుత్వ భూమి 13.89 ఎకరాలు ఉండగా 13.50 ఎకరాలుగా గుర్తించడం జరిగిందని తహసీల్దారు తెలిపారు. అదే విధంగా 16 సర్వే నెంబర్లు ఉండగా 265 మందికి ఎల్‌పీఎంలు ఇచ్చామని ఆయన వెల్లడించారు. ఈ సమావేశానికి సర్పంచి మోపాడ అప్పారావు అధ్యక్షత వహించగా తమ రికార్డుల్లో తప్పులు సవరించాలంటూ ఏడుగురు దరఖాస్తులు చేసుకున్నారు.

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండలం తానాం సామాజిక భవనం వద్ద గురువారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. జిల్లా సర్వే అధికారిణి మనీషాత్రిపాఠి, డిప్యూటీ తహసీల్దార్ సురేశ్‌నాయుడు తదితరులు హాజరై మాట్లాడారు. రెవెన్యూపరమైన సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేస్తున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రీసర్వేలో ఏమైనా తప్పులు పడినా, హద్దులు, కొలతల్లో తేడా వచ్చినా, ఎవరి భూమి అయినా సర్వే చేయకపోయినా, ఎటువంటి భూ సమస్యలున్నా అర్జీలు పెట్టుకోవాలన్నారు. మండల సర్వేయర్ శ్రీనివాస్ ఇంతకు ముందు జరిగిన రీసర్వే గురించి వివరించారు. అనంతరం ప్రజల నుంచి రెవెన్యూ సిబ్బంది వినతులు స్వీకరించారు. మొత్తం 31 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు పైలా సన్యాసిరాజు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు పైలా జగన్నాథరావు, సర్పంచి కన్నూరు దేవి, మండల సర్వేయర్ శ్రీనివాస్, రీసర్వే డీటీ సురేశ్, వీఆర్వో భుజంగరావు, స్థానిక నాయకులు స్థానికనాయకులు కన్నూరు వెంకటరమణ, రొంగలి గోపాలకృష్ణ పాల్గొన్నారు.


విప్పాక అగ్రహారం సదస్సులో పాల్గొన్న అధికారులు


తానాంలో మాట్లాడుతున్న జిల్లా సర్వే అధికారిణి మనీషాత్రిపాఠి

విద్యార్థులకు వైద్య సేవలు

పరవాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి ఇస్లాంపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, పిట్టవానిపాలెం మండల పరిషత్తు ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రదీప్‌ప్రసాదురాజు తదితర వైద్య సిబ్బంది విద్యార్థులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిల్లల్లో పుట్టుకతో వచ్చే వ్యాధుల నిమిత్తం స్క్రీనింగ్ చేశారు. తొలుత చేతులు, వ్యక్తిగత శుభ్రత, సురక్షిత తాగునీరు, ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీఈహెచ్‌వో శ్రీనివాసరావు, వైద్యసిబ్బంది గోపాలం, సరస్వతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రదీప్‌ప్రసాదురాజా

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు వజ్రాయుధం

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బి.సీతాలక్ష్మి ఆధ్వర్యంలో తహసీల్దారు, బి.చిన్నికృష్ణ, ఎంపీడీవో పి.పద్మజల ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ బి.సీతాలక్ష్మి మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను కాపాడేందుకు ఓటు వజ్రాయుధంలా పని చేస్తుందన్నారు. యువత ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. తహసీల్దారు చిన్నికృష్ణ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన వారు ఓటు నమోదుకు ఫారం-6ను నింపి ఇవ్వాలన్నారు. ఈ దరఖాస్తు ఫారాలు ఉచితంగా ఇస్తామన్నారు. ఆన్‌లైన్‌లో ఓటు నమోదు చేసుకునే విధానం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అర్జునరావు, ఉప ప్రిన్సిపల్ బి.శంకర్ తదితరులు పాల్గొన్నారు.


ఓటు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉప ప్రిన్సిపల్ శంకర్

మ్యాన్‌హోళ్ల పూడిక తొలగింపు

చినముషిడివాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ శ్రమశక్తినగర్ ఒకటో లేఅవుట్‌లో పూడికపోయిన భూగర్భ మురుగునీటి వ్యవస్థ మ్యాన్‌హోళ్లను యూజీడీ సిబ్బంది గురువారం శుభ్రం చేశారు. మురుగు పొంగిపొర్లుతోందని కాలనీవాసులు కార్పొరేటర్ శానాపతి వసంత శంకర్రావుకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఆమె అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.


శ్రమశక్తినగర్‌లో..

పల్లెల సర్వతోముఖాభివృద్ధికి కృషి


జంగాలపాలెంలో శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచకర్ల, అధికారులు, నాయకులు

పెందుర్తి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం పల్లెల్లో అభివృద్ధి వెలుగులు నింపేందుకు కృషి చేస్తోందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబు అన్నారు. 'పల్లె పండగ - పంచాయతీ వారోత్సవాలు' కార్యక్రమంలో భాగంగా గురువారం పెందుర్తి మండలం పరిధిలోని సరిపల్లి, జంగాలపాలెం, రాజయ్యపేట, పెదగాడి, చింతలగ్రహారం పంచాయతీల్లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా మంజూరైన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. జనవరి నాటికి పనులన్నీ పూర్తిచేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలని స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో పెందుర్తి ఎంపీడీవో కొల్లి వెంకటరావు, పీఆర్ డీఈ రమణమూర్తి, గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చింతలగ్రహారం(వేపగుంట), న్యూస్‌టుడే: చింతలగ్రహారంలో పల్లెపండుగ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. సర్పంచి దాడి గోపీఅప్పలనాయుడు పంచాయితీకి కేటాయించిన రూ.14 లక్షలతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దాడి వరలక్ష్మీ, మాజీ ఎంపీపీ కాళ్లవరలక్ష్మీ, మాజీ సర్పంచులు పి.వెంకటరమణ, పి.అప్పారావు, మాజీ ఉపసర్పంచి ఎస్.భీమేశ్వరరావు, జనసేన నాయకులు కె.సంతోష్ గ్రామపెద్దలు పాల్గొన్నారు. భారీ వర్షం కారణంగా ఎమ్మెల్యే హాజరుకాలేక పోతున్నారని సర్పంచి ఆధ్వర్యంలో శంకుస్థాపన చేసేయాలని సూచించడంతో కూటమి నాయకులు ఈ కార్యక్రమాన్ని కొనసాగించారు.


చింతలగ్రహారంలో సర్పంచి దాడి గోపీఅప్పలనాయుడు తదితరులు

భారీ వర్షంతో పర్యటనలు రద్దు

భారీవర్షం కారణంగా పల్లెపండుగ కార్యక్రమాలు చింతగట్ల, జెర్రిపోతులపాలెంలలో గురువారం రద్దయ్యాయి. వీలును బట్టి మళ్లీ కార్యక్రమాలు జరుపుతామని లేదంటే అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే వస్తారని ఆయా గ్రామ పెద్దలకు ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి.

విశ్వకర్మ యోజనతో ఆర్థిక స్వావలంబన

పెందుర్తి, న్యూస్‌టుడే: ఆర్థిక స్వావలంబన సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విశ్వకర్మ యోజన పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అన్నారు. వెలుగు, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో గురువారం పెందుర్తి కూడలిలోని తాండ్ర పాపారాయుడు కల్యాణ మండపంలో విశ్వకర్మ యోజనపై అవగాహన సదస్సు జరిగింది. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని మోదీ కులవృత్తులు చేసుకునే పేదలకు అండగా ఉండాలన్న సంకల్పంతో ఈ పథకం ప్రవేశపెట్టారన్నారు. విశాఖ జిల్లాలో 58 వేల మంది దరఖాస్తు చేసుకోగా 7,091 మంది మాత్రమే అర్హులుగా ఎంపికయ్యారన్నారు. పథకంపై అవగాహన లేకపోవడం వల్లే ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఈ నేపథ్యంలో వెలుగు, డీఆర్‌డీఏ అధికారులు విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. పలువురు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో జోన్-8 జెడ్సీ హేమావతి, వెలుగు ఏరియా కో-ఆర్డినేటర్ సత్యంనాయుడు, పెందుర్తి భాజపా కన్వీనర్ గొర్లె రామునాయుడు, జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, కూటమి నాయకులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రమేశ్ బాబు, అధికారులు, నాయకులు


అవగాహన సదస్సులో పాల్గొన్న డ్వాక్రా మహిళలు

భక్తి శ్రద్ధలతో గౌరమ్మ తల్లికి పూజలు

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం మొగలిపురం గ్రామంలో గౌరమ్మతల్లి ప్రతిష్ఠ పూజలు ఘనంగా జరిగాయి. భక్తులు గౌరమ్మను మేళతాళాలతో బాణసంచా కాల్పుల నడుమ భారీగా ఊరేగింపు నిర్వహించి ప్రతిష్ఠా స్థలికి తీసుకొచ్చి గౌరమ్మను ప్రతిష్ఠించారు. పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని వేడుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు నేతలు గండి రవికుమార్, సిరపరపు వాసు, ఇందుగుబిల్లి దేముడు, కనకరాజు దేముడు, సత్యనారాయణ, బంగారయ్య, పలువురు మహిళలు పాల్గొన్నారు.


గౌరమ్మతల్లికి పూజలు చేస్తున్న భక్తులు


చింతలగ్రహారం వరి దుబ్బులకు పూజలు చేస్తున్న దృశ్యం

చింతలగ్రహారం (వేపగుంట), న్యూస్‌టుడే: చింతలగ్రహారం కృష్ణాలయంలో గురువారం గౌరీపూర్ణిమ పూజలు ఘనంగా జరిగాయి. ఆశ్వయుజ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రత్యేకంగా వరి దుబ్బులను గౌరీపరమేశ్వరులుగా తీర్చిదిద్ది పూజలు చేశారు. కార్తిక పౌర్ణమి వరకు రోజూ గౌరీపరమేశ్వరులకు ఆరాధన, విశేష హారతి జరుగుతుందని ఆలయ ధర్మకర్త ఆళ్ల తాతారావు తెలిపారు.

వేడుకగా దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు

ప్రహ్లాదపురం(వేపగుంట), న్యూస్‌టుడే: ప్రహ్లాదపురం దరి సింహాచలం ఆర్టీసీ డిపోలో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. దసరా రోజున అమ్మవారి ప్రతిమను ప్రతిష్ఠించి రోజూ పూజలు నిర్వహిస్తున్నారు. గురువారం ఆర్టీసీ మహిళా కండక్టర్లు, కార్యాలయంలోని మహిళలు, తదితరులు అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. శనివారం దీపారాధన, ఆదివారం అమ్మవారి నిమజ్జనం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం దేవీపురం రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో ఈనెల 3 నుంచి ప్రారంభమైన దసరా బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి 28 కలశాల పుణ్య జలాలతో రాజరాజేశ్వరీ అమ్మవారికి పూర్ణ కుంభాభిషేకం, పంచామృతాభిషేకాన్ని నిర్వహించారు. జ్ఞానేశ్వరీ మాతకు సైతం కలశ పంచామృతాభిషేకం చేశారు. అనంతరం లలితా సహస్రనామావళి పఠనం జరిగింది. సాయంత్రం చంద్రోదయ సమయంలో శ్రీమేరు చెంతనున్న కొలనులో చంద్రబింబాన్ని తిలకించారు. అనంతరం సిరి జ్యోతి పూజ నిర్వహించి జలహారతి కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం అమ్మవారి పవళింపు సేవతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.


కామేశ్వరీ దేవికి కలశ స్నానం చేయిస్తున్న భక్తులు


ఆర్టీసీ డిపోలో కుంకుమ పూజల్లో మహిళలు

పెందుర్తి గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

పెందుర్తి, న్యూస్‌టుడే: సుజాతనగర్ దరి లక్ష్మీనరసయ్యమ్మ కాలనీకి చెందిన బలివాడ కృష్ణప్రియ, శ్రీనివాసరావు, యశ్వంత్ పెందుర్తి శాఖా గ్రంథాలయానికి భారీ ఎత్తున పుస్తకాలు బహూకరించారు. గురువారం గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో నవలలు, సాహిత్యం, పోటీ పరీక్షలకు సంబంధించిన సుమారు 500 పైగా పుస్తకాలను గ్రంథాలయాధికారిణి బి.సూర్యకళకు అందజేశారు. ఇదే స్ఫూర్తిగా మరింత మంది ముందుకొచ్చి గ్రంథాలయానికి పుస్తకాలు సమకూర్చాలని సూర్యకళ కోరారు.


గ్రంథాలయ సిబ్బందికి పుస్తకాలు అందిస్తున్న దాతలు



యూబీఏ ఆడిట్‌లో పాల్గొన్న ఏయూ ప్రాంతీయ సమన్వయకర్త పావని, అధ్యాపకులు, విద్యార్థులు

గ్రామాలభివృద్ధికి విద్యార్థుల కృషి

పెందుర్తి, న్యూస్‌టుడే: ఉన్నత భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు గ్రామాలభివృద్ధిలో తమవంతు పాత్ర పోషించాలని ఈ పథకానికి సంబంధించిన ఆంధ్రా విశ్వవిద్యాలయం ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ బి.పావని సూచించారు. స్థానిక ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో గురువారం ఉన్నత భారత్ అభియాన్ (యూబీఏ) అకడమిక్ ఆడిట్ జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులతో పావని పలు అంశాలపై చర్చించారు. అయిదు గ్రామాలను దత్తత తీసుకుని పలు అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు విద్యార్థులు కృషి చేస్తున్నారని కళాశాల కార్యదర్శి టి.థియోఫిలస్ తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బవరం పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎంఎస్‌వీకే బాలాజీ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఎల్‌హెచ్‌పీలపై ఆరోపణలు రావడంతో సంబంధిత హాజరు పట్టికను పరిశీలించారు. అందిస్తున్న సేవలు ప్రధాన వైద్యుడు ఎస్ఎన్ఆర్ చక్రవర్తిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వివిధ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన గొట్టివాడలోని విలేజ్‌హెల్త్ క్లినిక్‌ను సందర్శించారు. వర్షాకాలంలో ప్రజలు రోగాల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చక్రవర్తి, సిబ్బంది పాల్గొన్నారు.


దస్త్రాలను పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బాలాజీ

మేమున్నాం.. మీకు తోడుగా

పెందుర్తి : 90598 98721
వేపగుంట: 93472 79909
10 AM - 1 PM

పరవాడ, న్యూస్‌టుడే

సమస్య: పరవాడ మండలం గొర్లెవాణిపాలెం పంచాయతీ పరిధి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో చెత్తకుప్పలు పెరిగిపోయాయి.
– రమణ, స్థానికుడు

సమాధానం: త్వరలోనే ప్రత్యేక డ్రైవ్ చేపట్టి వ్యర్థాలను తొలగిస్తాం.
– ధర్మారావు, ఈవోపీఆర్డీ, పరవాడ

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం

పెందుర్తి, న్యూస్‌టుడే: అల్పపీడనం ప్రభావంతో పెందుర్తిలో బుధవారం రాత్రి నుంచి భారీవర్షం కురిసింది. విడతలు విడతలుగా పెద్దఎత్తున కురిసిన వర్షంతో రహదారులన్నీ జలమయమయ్యాయి. పెందుర్తి కూడలిలో బీఆర్టీఎస్ రహదారిలో నీరు నిలిచిపోయి వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందిపడ్డారు. పలు కాలనీల్లో రోడ్లపై నీరు నిలిచిపోయింది.

పరవాడ, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా పరవాడ మండలంలో జోరు వర్షం కురిసింది. ఆకాశం మేఘావృతమై విస్తారంగా వర్షం పడడంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. మొల్లోడుగెడ్డవాగుతో పాటు పరవాడ చెరువుల్లో నీరు చేరింది. పెద్దచెరువు నీటితో నిండి కళింగు పైనుంచి నీరు పారుతోంది. ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం, అప్పికొండ తీరాలకు చెందిన మత్స్యకారులు ఇంటికే పరిమితమయ్యారు. వర్షానికి పొలాల్లో సరుగుడు, యూకలిప్టస్ మొక్కలు నాటే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.


పరవాడలో..


భరణికం మొల్లోడు గెడ్డవాగులోకి చేరిన నీరు


పెందుర్తి కూడలిలో నిలిచిన నీరు


విశాఖ - పెందుర్తి రోడ్డులో వరద